జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

సంపుటి 12 సంచిక 225 విశాఖపట్నం ఆదివారం 02 మే 2021 8 పేజీలు వెల : 5.00

మాస్టర్ కీ TV (అంబేడ్కర్ TV) ఛానల్

కావలెను

Senior Anchor

Graphic Designer

Sub-Editor

Marketing Manager

అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును

ఆసక్తిగలవారు

ఈ క్రింది నెంబర్లల్లో సంప్రదించగలరు

8886656884, 9948725373

## కార్మికులకు జగన్ మేడే శుభాకాంక్షలు



అమరావతి,మే 01, ప్రజాపాలన ప్రతినిధి: ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు కార్మికులందరికీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేడే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. “తమ శ్రమతో సమాజాన్ని నిర్మించి, ప్రపంచ పురోగతికి బాటలు వేసే శ్రామిక సోదర సోదరీమణులకు మేడే శుభాకాంక్షలు” అంటూ సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

## ఢిల్లీలో లాక్‌డౌన్ మరో వారం పొడిగింపు




న్యూఢిల్లీ, మే 01, ప్రజాపాలన ప్రతినిధి: కరోనా వ్యాప్తి దృష్ట్యా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మరో వారం రోజుల పాటు లాక్‌డౌన్‌ను పొడిగిస్తున్నట్టు సీఎం కేజ్రీవాల్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. ప్రస్తుతం కొనసాగుతున్న లాక్‌డౌన్ గడువు వచ్చే సోమవారం(మే 3వ తేదీ) ఉదయం 5 గంటలకు ముగియనుంది. అయితే కరోనా పాజిటివ్ కేసులు రోజుకు 25 వేలకు మించకుండా నమోదు అవుతుండటంతో లాక్‌డౌన్‌ను మరో వారం రోజుల పాటు పొడిగించారు. ఢిల్లీలో ఏప్రిల్ 19 నుంచి లాక్‌డౌన్ అమల్లో ఉంది.నిన్న ఒక్కరోజే ఢిల్లీలో 27 వేల పాజిటివ్ కేసులు నమోదు కాగా, 375 మంది మరణించారు. వరుసగా 13వ రోజు 20 వేలకు పైగా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి.

## 16 కోట్ల ఉచిత కోవిడ్ వ్యాక్సిన్లు రాష్ట్రాలకు ఇచ్చాం: ఆరోగ్య శాఖ



న్యూఢిల్లీ,మే 01, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇంతవరూ 16.37 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్ డోసులు ఉచితంగా ఇచ్చామని, రాబోయే మూడు రోజుల్లో మరో 17 లక్షల డోసులు అందుకోనున్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారంనాడు తెలిపింది. మూడో దశ వ్యాక్సినేషన్ డ్రైవ్ దేశంలో ప్రారంభమైందని, ఈ దశలో దేశ యువత వ్యాక్సినేషన్ వేయించుకునేందుకు అర్హులని, తమ తమ జనాభాకు వ్యాక్సినేషన్ అందించేందుకు రాష్ట్రాల్లో 79 లక్షల (మిగతా 2లో..)

# ఏపీలో లాక్‌డౌన్‌పై సజ్జల కీలక వ్యాఖ్యలు



తాడేపల్లి,మే 01, ప్రజాపాలన ప్రతినిధి: కరోనా సెకండ్ వేవ్ చాలా ప్రమాదకరంగా ఉంది.. కానీ లాక్‌డౌన్ పెడితే రాష్ట్రం మరింత ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుంది అన్నారు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..“కరోనా కట్టడికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. ప్రజలు వ్యాక్సిన్ వేయించుకున్నా.. జాగ్రత్తలు పాటించాలి. కరోనా నియంత్రణపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోజు సమీక్షలు నిర్వహిస్తున్నారు” అని సజ్జల తెలిపారు.“ప్రజల ఆకాంక్షల మేరకు సీఎం జగన్ పాలన చేస్తున్నారు. ఆర్థిక సంక్షోభంలోనూ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా సీఎం జగన్ పాలన ఉంది. మా పాలనపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉంది. ముఖ్యమంత్రి తీసుకునే ప్రతి నిర్ణయం బాధ్యతాయుతంగా ఉంటుంది” అన్నారు. ఇక ప్రతిపక్ష నేత చంద్రబాబుపై నిప్పులు చెరిగారు సజ్జల. “చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారు.. హైదరాబాద్‌లో కూర్చుని ప్రజలకు భయాందోళనలకు గురి చేస్తున్నారు. సంక్షోభ సమయంలో రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలి అని సజ్జల సూచించారు.

## ఆక్సిజన్ అందక కర్నూలులో ఐదుగురు మృతి



కర్నూలు,మే 01, ప్రజాపాలన ప్రతినిధి: కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో దారుణం చోటుచేసుకుంది. అనుమతి లేకుండానే కరోనా బాధితులకు చికిత్స అందిస్తున్నారు. అయితే ఆ చికిత్స పొందుతున్న వారిలో ఐదుగురు ఆక్సిజన్ అందక మృతి చెందారు. ఈ సంఘటనపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే స్పందించిన కలెక్టర్ ఆస్పత్రిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై విచారణ చేపడుతున్నట్లు కర్నూలు కలెక్టర్ తెలిపారు. కర్నూలులోని కేఎస్ కేర్ ఆస్పత్రిలో కరోనా చికిత్సకు అనుమతి లేదు. అయినా కూడా నిబంధనలకు విరుద్ధంగా కరోనా బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆక్సిజన్ అందక ఐదుగురు మృతి చెందారు. అనుమతి లేకుండానే కోవిడ్ చికిత్స చేస్తున్నట్లు నిర్ధారణ అయ్యింది. కేఎస్ కేర్ ఆస్పత్రిలో కోవిడ్ వైద్యానికి అనుమతి లేదు కలెక్టర్ స్పష్టం చేశారు. ఘటనపై డీఎంహెచ్ఓ విచారణ చేస్తున్నారు.కోవిడ్ ఆస్పత్రిగా నోటిఫైడ్ చేయని కేఎస్కేర్ ప్రైవేట్ ఆసుపత్రిలో కరోనా బాధితులు ఆక్సిజన్ అందక చనిపోయారనితెలుసుకుని డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య విచారణ (మిగతా 2లో..)

# భారత్‌లో కరోనా పరిస్థితులపై ఆంటోనీ ఫౌచీ సూచనలు



న్యూఢిల్లీ, మే 01, ప్రజాపాలన ప్రతినిధి:భారత్‌లో కరోనా రెండో దశ ఉద్ధృతిని కట్టడికి అంతర్జాతీయ స్థాయి అంటువ్యాధుల నివారణ నిపుణుడు, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వైద్య సలహాదారుడు డాక్టర్ ఆంటోనీ ఫౌచీ కీలక సూచనలు చేశారు. వెంటనే దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడంతో పాటు చైనా తరహాలో అత్యవసర చికిత్సా కేంద్రాలు భారీ ఎత్తున ఏర్పాటు చేయడం, కరోనా పరిస్థితుల సమగ్ర పర్యవేణకు ఓ కేంద్రీకృత వ్యవస్థ ఉండాలంటూ ఫౌచీ మూడు కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు ప్రముఖ జాతీయ మీడియా సంస్థ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. కొవిడ్‌పై విజయం సాధించామని భారత్ ముందే ప్రకటించేసిందని ఫౌచీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రస్తుతం భారత్ క్లిష్ట పరిస్థితుల్లో ఉందని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో దేశాన్ని తాత్కాలికంగా షట్‌డౌన్ చేయడం చాలా ముఖ్యమైన అంశమని తెలిపారు. లాక్‌డౌన్ విధించడానికి ఏ దేశమూ ఇష్టపడదని.. కానీ, కొన్ని వారాల పాటు లాక్‌డౌన్ అమలు చేయడం వల్ల పెద్ద సమస్యలేమీ తలెత్తవని తెలిపారు. అందుకు ఆయన చైనాను ఉదాహరణగా చెప్పారు. చైనాలో వైరస్ విజృంభణ ప్రారంభమైన వెంటనే యావత్తు దేశాన్ని షట్‌డౌన్ చేశారని గుర్తుచేశారు. నెలల తరబడి షట్‌డౌన్ విధించాల్సిన అవసరం లేదని.. కొన్ని వారాల పాటు అమలు చేస్తే వ్యాప్తి ఆగిపోతుందని వివరించారు. అలాగే వెంటనే ఆక్సిజన్, ఔషధాలు, పీపీఈ కిట్లు సమకూర్చుకోవాలని సూచించారు.

## ప్రస్తుతం భారత్‌లో డేంజర్ పరిస్థితి: కేఏపాల్



విశాఖపట్నం,మే 01, ప్రజాపాలన ప్రతినిధి:భారత్‌లో వచ్చిన కరోనా కేసులు.. ప్రపంచంలో మరెక్కడా రాలేదని కేఏపాల్ అన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు రద్దు చేయాలని కోరుతూ కేఏపాల్ చేపట్టిన దీక్ష మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో డేంజర్ పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి పనికిమాలిన సలహాలు తీసుకుని తమ భవిష్యత్తు పాడు చేసుకుంటున్నారని అన్నారు. జగన్ రాజకీయ శత్రువుగా మారుతున్నారని తెలిపారు. “సోమవారం కోర్టు తీర్పు కచ్చితంగా రద్దు చేయాలని వస్తుంది... ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి... నేను వెంటనే దీక్ష విరమిస్తాను” అని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పిల్లలు పరీక్షలు వాయిదా వేయాలని కోరుతున్నారని తెలిపారు. (మిగతా 2లో..)

## జగన్ తో జనం.. బంధం

(వివరాలు 2లో..)

## కరోనా వస్తే.. ఇక అనాథలేనా?

తిరుపతి, మే 01, ప్రజాపాలన ప్రతినిధి: జన్మనిచ్చిన తల్లిదండ్రులు కన్నబిడ్డలు కర్కశత్వం ప్రదర్శిస్తున్నారు. కరోనా సోకిన తల్లిదండ్రులను ఆస్పత్రుల్లో చేర్చి చేతులు దులుపుకుంటున్నారు. తమకు ఎవరూలేరని అనాథలమని తలుచుకుంటూ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కన్నుమూస్తున్నారు. కడచూపు చూడటానికి కూడా రాకపోవడంతో ఎలాంటి సంబంధంలేని వ్యక్తులు తలకొరివి పెడుతున్నారు. ఇలాంటి హృదయవిదారక ఘటనలు ఆస్పత్రుల్లో నిత్యకృత్యంగా మారడం, కరోనా వస్తే అనాథలేనా అనే పరిస్థితులు దాపరిస్తా ఉండటం పలువురిని కలచివేస్తున్నాయి.





## 2 లక్షల డోసుల వ్యాక్సిన్‌ను అలా వదిలేసి వెళ్లారు!

భోపాల్, మే 01, ప్రజాపాలన ప్రతినిధి: ఓవైపు దేశమంతా కరోనా వ్యాక్సిన్ కొరతతో అల్లాడిపోతుంటే.. మరోవైపు లక్షల కొద్దీ డోసుల వ్యాక్సిన్‌ను అలా రోడ్డు పక్కన వదిలేసి వెళ్లడం గమనార్హం. మధ్యప్రదేశ్‌లోని నర్సింగ్‌పూర్ జిల్లాలోని కరేలీ బస్టాండ్ దగ్గర సుమారు 2.4 లక్షల కొవాగ్జిన్ డోసులు ఉన్న ట్రక్‌ను ఎవరో వదిలేసి వెళ్లారు. ఆ ట్రక్ చాలా సేపటి నుంచి అక్కడే ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కరేలీ పోలీసులు వచ్చి చూడగా.. అందులో కరోనా వ్యాక్సిన్‌ను గుర్తించారు.అందులో డ్రైవర్, క్లీనర్ ఎవరూ లేరు. ఈ వ్యాక్సిన్ల మొత్తం ఖరీదు రూ. 8 కోట్ల వరకూ ఉంటుందని కరేసీ ఎస్ఐ ఆశిష్ బొపాచె వెల్లడించారు. డ్రైవర్ ఫోన్ నంబర్ తెలుసుకొని ట్రేస్ చేయగా.. అతని ఫోన్ రోడ్డు పక్కన పొదల్లో దొరికినట్లు ఆయన చెప్పారు. ట్రక్‌లో ఏసీ పని చేస్తోందని, దానిని బట్టి వ్యాక్సిన్లన్నీ బాగానే ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. డ్రైవర్, క్లీనర్ కోసం తాము ఇంకా వెతుకున్నట్లు చెప్పారు.

దేశంలో ఏ సంస్థ కూడా ఇవ్వని అవకాశం మీ కోసం

SNEHA MACS Ltd.

Ph : 040-23233989

“THE SNEHA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED.”

Regd. No. TS/DCO/HYD/MACS/2017/314Dt 30th May 2017

SNEHA GROUP OF ORGANISATIONS SNEHA CLUB 20 YEARS CELEBRATIONS

స్నేహ పెన్షన్ స్కీమ్ లో

చేరండి ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

01 జనవరి 2021 నుండి 7 సం॥ల పాటు డిపాజిట్ చేసిన వారికి డబుల్ ఎమౌంట్ ఇవ్వబడును.

సంవత్సరానికి 11% వడ్డీ ఇవ్వబడును

మీ డిపాజిట్ పై లభించే వడ్డీ

| | |
|---|---|
| రూ. 1,00,000/- | రూ. 11,000/- |
| రూ. 5,00,000/- | రూ. 55,000/- |
| రూ. 10,00,000/- | రూ. 1,10,000/- |

*షరతులు వర్తిస్తాయి

మీ మనవళ్ళకు మరియు మనవరాళ్ళకు చదువుకు, పెళ్ళి కోసం కానుకగా

మీ డిపాజిట్ 7 సం॥కే రెట్టింపు (Double)

డాక్టర్ కె. శివ భాగ్యారావు IRS, VRS చైర్మెన్

ఎస్. రామకృష్ణ మాక్స్ ప్రెసిడెంట్ 9133312134

రండీ...! త్వరపడండీ...!

# ఒంగోలు రిమ్స్‌హాస్పిటల్ లోని ప్రిజనర్‌వార్డ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

ఒంగోలు, మే 01, ప్రజాపాలన ప్రతినిధి:ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ లోని ప్రిజనర్ వార్డ్ ను ప్రకాశం జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రిజనర్ వార్డ్ నుండి ముద్దాయిలు తప్పించుకొని పోకుండా చేయవలసిన భద్రత ఏర్పాట్లు గురించి హాస్పటల్ అధికారులతో మరియు స్ధానిక పోలీస్ అధికారులతో చర్చించారు. ప్రిజనర్ వార్డ్ ను పరిశిలించి, వార్డులోని కిటికీలకు ఇనుప గ్రిల్స్ ను ఏర్పాటు చేయాలని ఆసుపత్రి అధికారులకు సూచించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్నపోలీస్ సిబ్బందికి, ప్రిజనర్స్ విషయంలో తీసుకోవలసిన భద్రత గురించి తగు సూచనలు తెలియజేశారు. అనంతరం కరోనా పాజిటివ్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నందున,







హాస్పిటల్ వచ్చే రోగుల బంధువులకు మరియు హాస్పిటల్ సిబ్బందికి మధ్య తలెత్తేలా అండ్ ఆర్డర్ విషయం గురించి, ప్రకాశం జిల్లా కలెక్టర్ పోలా భాస్కర్ తో మరియు రిమ్స్ సూపరింటెండెంట్ మురళీ కృష్ణ రెడ్డి తో ఎస్పీ చర్చించి, కొంతమంది పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలియచేశారు. రిమ్స్ లో డాక్టర్లు, నర్సులు మరియు పేషెంట్‌ల మధ్య ఏ విధమైన గొడవలు జరగకుండా, వారధిలా ప్రవర్తించే విధంగా పోలీస్ సిబ్బందిని నియమిస్తామని తెలియచేశారు. కొన్ని సందర్భాలలో డ్యూటీలో ఉన్న డాక్టర్స్ మరియు నర్సుల పట్ల ఎవరైనా దురుసుగా ప్రవర్తించిన, గొడవపడినట్లు అధికారుల దృష్టికి వస్తే వారిపైన చట్టపరమైన మరియు కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలియచేశారు.అదే విధంగా పోలీస్ అవుట్ పోస్ట్ లో అదనంగా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తామని, డ్యూటీలో ఉన్న డాక్టర్లు పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది పనిచేసే విధంగా తగు చర్యలు తీసుకుంటామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి.–1 ఇన్స్పెక్టర్ వి.సూర్య నారాయణ, తాలూకా సిఐ శివరామ కృష్ణారెడ్డి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దేవుడే డాక్టర్ రూపంలో వచ్చాడనిపించేలా.. డాక్టర్ విజయభాస్కర్ వైద్య సేవలు ప్రశంసనీయం

**– ఎఫ్.ఎన్.ఓ. కొల్లిమర్ల.నాగేంద్రమ్మ సేవలు ఆదర్శనీయమన్న డాక్టర్ ఎస్ విజయభాస్కర్**

**– 43సంవత్సరాలుగా జిల్లాలోని వివిధ వైద్యశాలల్లో విధుల నిర్వహణ**

**– నాగేంద్రమ్మ పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానం, ఆత్మీయ సత్కార కార్యక్రమం**



చినగంజాం(ఒంగోలు) : చినగంజాం పి.హెచ్.సి.కి, దేవుడే డాక్టర్ రూపంలో వచ్చాడనిపించేలా, డాక్టర్ విజయభాస్కర్ అంకితభావంతో, అహర్నిశలు ఏ మాత్రం విశ్రాంతి తీసుకోకుండా, వైద్య సేవలు అందించటం ప్రశంసనీయమని ఎఫ్.ఎన్.ఓ. కొల్లిమర్ల.నాగేంద్రమ్మ, పలువురు వక్తలు అన్నారు.మహిళా ఆరోగ్య పరిరక్షకురాలిగా వివిధ వైద్య శాలలలో అంకితభావంతో ఎఫ్.ఎన్.ఓ. కొల్లిమర్ల నాగేంద్రమ్మ అందించిన వైద్య సేవలు స్ఫూర్తిదాయకం మరియు ఆదర్శనీయమని చినగంజాం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్. ఎన్. విజయభాస్కర్ అన్నారు. చినగంజాం పి హెచ్ సి ఆవరణలో ఎఫ్.ఎన్.ఓ.కొల్లిమర్ల నాగేంద్రమ్మ పదవీ విరమణ సందర్భంగా, ఏర్పాటు చేసిన సన్మాన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్. ఎస్. విజయభాస్కర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. మర్యాద పూర్వకంగా నాగేంద్రమ్మను సన్మానించి, అనంతరం డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ, ఏ ఉద్యోగి కైనా పదవీ విరమణ తప్పదని, అయితే వారు విధినిర్వహణలో చేసిన సేవలను మనమందరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, 43సంవత్సరాలుగా జిల్లాలోని వివిధ వైద్యశాలల్లో విధులు నిర్వహించి, ఎందరో గర్భవతులకు, బాలింతలకు కన్న తల్లిలా వైద్య సేవలు అందించి అధికారుల మన్ననలు పొందటం ప్రశంసనీయమన్నారు. వైద్యఆరోగ్యశాఖ లో ఉన్నతాధికారులప్రశంసలు,



ఎన్నో అవార్డులు అందుకున్ననాగేంద్రమ్మ రిటైర్డ్ అయిన తర్వాత, ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని కోరుకుంటున్నామన్నారు. వైద్యశాలసిబ్బంది, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, బంధువులు, సన్నిహితులు, పలువురు నాగేంద్రమ్మను ఘనంగా సన్మానించారు. పదవీవిరమణ వీడ్కోలుసభలో నాగేంద్రమ్మ మాట్లాడుతూ, చినగంజాం పి.హెచ్.సి.కి, దేవుడే డాక్టర్ రూపంలో వచ్చాడనిపించేలా, డాక్టర్. విజయభాస్కర్ అంకితభావంతో,అహర్నిశలు ఏమాత్రం విశ్రాంతితీసుకోకుండా, వైద్య సేవలు అందించటం ప్రశంసనీయమన్నారు. అటువంటి వైద్యులు, అత్యంతఆత్మీయంగా, నిజాయితీగా అంకితభావంతో సేవలుఅందించే వైద్యశాలసిబ్బంది సమిష్టి సహాయసహకారాలతోనే, ప్రశాంతంగా పదవీవిరమణ చేయగలిగానని, డాక్టర్ విజయభాస్కర్ కు, వైద్యశాల సిబ్బంది అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సి.హెచ్.ఓ దీనాకుమారి, పి.హెచ్.ఎన్.బేబి, హెల్త్ ఎడ్యుకేటర్ హరిప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ శ్యామ్,సీనియర్ అసిస్టెంట్ బాలాకుమారి,ఫార్మాసిస్ట్ సుశీల,పర్యవేక్షకులు సుబ్బారావు, లీలావతి, ప్రసన్న, స్టాఫ్‌నర్సులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

# చైనా అధ్యక్షుని పై మాజీమంత్రి డాక్టర్.పాలేటి ధ్వజం

**– దేశంలో, రాష్ట్రంలో మరే నేతకు చీమకుట్టినట్లైనా లేదేంటో.?**

**– కరోనా మహమ్మారికి కారణం ఎవరో తెలియకా?, ధైర్యం లేకా.?**

ఒంగోలు : ప్రపంచంలో కరోనా మహమ్మారి విస్తృతంగా వ్యాపిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. మూలం ఎక్కడో కారణం ఏమిటో అర్ధమైనా కూడా దేశంలో ఏ నేత కనీసం స్పందించటం లేదు. గతంలో లేని విధంగా భారత దేశంలో, ఈ సారి పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. అయినా దేశాదినేతకు గానీ ప్రతిపక్ష నేతలు కానీ, చైనా పై విమర్శలు చేసే ధైర్యం కూడా చేయటం లేదు. అతి పెద్ద ప్రజాస్వామ్యదేశం అల్లకల్లోలం అయిపోతుంటే, దేశంలో ఎవరూ పెద్దగా స్పందించకపోయినా, ఆంధ్రప్రదేశ్ లో ఓ మాజీ మంత్రి స్పందించారు. ఆయనే మాజీ మంత్రి, ప్రకాశం జిల్లా చీరాల నియోజకవర్గ వైసిపి నేత డాక్టర్ పాలేటి రామారావు. తీవ్ర స్థాయిలో స్పందించిన మాజీ మంత్రి డాక్టర్ పాలేటి మాట్లాడుతూ, కరోనావైరస్ విస్తృతికి, పరోక్షంగా కారకుడైన చైనాఅధ్యక్షులు జిన్‌పింగ్ పై, తీవ్రస్థాయిలో ధ్వజమెత్తి, ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. చైనా అధ్యక్షుడిని చంపేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

– చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ ను ఉరితీయాలి – మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు

చీరాలలో చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ దిష్టిబొమ్మను మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత సైన్యాన్ని ఎదుర్కోలేక దొంగచాటుగా దెబ్బ తీసేందుకు, దేశ ఆర్థిక వ్యవస్థను కుప్ప కూల్చేందుకు, చైనా దేశ అధ్యక్షుడు జిన్ పింగ్ ముంబై, ఇతర ప్రాంతాలలో, కరోనా వైరస్ సెకండ్ వేవ్ ను తయారుచేసి, ప్రజల మీదకు వదిలాడని ఆరోపించారు. ప్రజలు ఈ విషయాన్ని గ్రహించి, ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తే, వైరస్ నియంత్రణ సులువు అవుతుందని పేర్కొన్నారు. వెంటనే ప్రపంచ దేశాలు కరోనా వ్యాప్తికి కారకుడైన జిన్‌పింగ్‌ను ఉరితీయడానికి ఐక్యరాజ్యసమితిలో గళమెత్తాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గవిని.శ్రీనివాసరావు, గవిని నారాయణ, పులి వేంకటేశ్వర్లు (పెద్దపులి), బిట్ర శ్రీనివాసరావు, గొర్ల శ్రీను, కావూరి రమణారెడ్డి, పొద వెంకట్రావు, కాసాని రాము, జగ్గారపు శ్రీనివాసరావు, కామినేడి రామకృష్ణ, స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## భార్య గొంతు కోసిన భర్త



పొన్నూరు, ప్రజా పాలన ప్రతినిధి : కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య గొంతుకోసిన భర్త ఉదంతమిది. పొన్నూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో భార్య చికిత్స పొందుతుంది. పొన్నూరు పట్టణం 29వ వార్డులో నివాసం ఉంటున్న గోగుల ఉమామహేశ్వరరావు, విజయకుమారి లకు వివాహం జరిగింది. అనంతరం కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరు విడిపోయి విడివిడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఉమామహేశ్వరరావు శనివారం మధ్యాహ్నం పొన్నూరులో నివాసముంటున్న భార్య విజయకుమారి ఇంటికి వచ్చాడు. తనతో తెచ్చుకున్న కత్తిని తీసి అకస్మాత్తుగా భార్య విజయకుమారి గొంతుకోసి హత్య చేసేందుకు విఫల యత్నం చేశాడు. ఈ నేపథ్యంలో ఇరుగు పొరుగు వారు కేకలు విని వెంటనే చుట్టు ముట్టారు. ఉమామహేశ్వరరావు పారిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న విజయ కుమారిని ఇంటి పక్క వాళ్ళు హుటాహుటిన పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ సీఐ శరత్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉమామహేశ్వరరావు గుంటూరు సమీపంలో యనమదల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నట్లు సమాచారం.

## కర్నూలు ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నా: చంద్రబాబు

అమరావతి: కర్నూలు ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్నూలులో ఆక్సిజన్ అందక ఆరుగురు మరణించడం బాధాకరమన్నారు. సీఎం జగన్‌రెడ్డి అసమర్థతకు ఎంత మంది బలికావాలి? అని ప్రశ్నించారు. ఆక్సిజన్ కొరత నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, సదుపాయాలున్న ప్రతి ప్రైవేటు ఆస్పత్రిని కొవిడ్ ఆస్పత్రిగా మార్చాలన్నారు. ఆక్సిజన్ బెడ్ల సంఖ్యను పెంచి మెరుగైన చికిత్స అందించాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.



## 16 కోట్ల ఉచిత కోవిడ్ వ్యాక్సిన్లు రాష్ట్రాలకు ఇచ్చాం: ఆరోగ్య శాఖ

(మొదటి పేజీ తరువాయి)

వ్యాక్సిన్ డోస్‌లు ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయని వివరించింది. రాష్ట్రాలు, యూటీలకు ఇచ్చిన మొత్తం 16.37 కోట్ల ఉచిత వ్యాక్సిన్ డోసులలో వృథా అయిన (వేస్టేజీ) వాటితో కలుపుకొని 15,58,48,782 డోసులు వినియోగమైనట్టు తెలిపింది. గరిష్ట సంఖ్యంలో వ్యాక్సిన్లు అందుకున్న రాష్ట్రాల్లో మహారాష్ట్ర ముందు వరుసలో ఉండగా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ఆ తరువాత స్థానాల్లో ఉన్నాయి. లక్షద్వీప్‌లో వ్యాక్సిన్ వేస్టేజీ 9.76 శాతంగా ఉండగా, తమిళనాడులో 8.83 శాతం, అసోంలో 7.70 శాతం, మణిపూర్‌లో 7.44 శాతం, హర్యానాలో 5.72 శాతం ఉంది.

## ఆక్సిజన్ అందక కర్నూలులో ఐదుగురు మృతి

(మొదటి పేజీ తరువాయి)

మొదలు పెట్టారు. కలెక్టర్ వీరపాండియన్ ఆదేశాల మేరకు అధికారులు ఆస్పత్రికి వెళ్లారు. కేఎస్‌కేర్ ఆస్పత్రిలో ఉన్న బాధితులందరినీ అంబులెన్స్‌లో కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. అనుమతి లేకుండా కోవిడ్ పేషెంట్స్‌ను అడ్మిట్ చేసుకుని అనధికారికంగా ట్రీట్మెంట్ ఇచ్చిన ఆస్పత్రి యజమాన్యంపై క్రిమినల్ కేసు బుక్ చేశారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ చట్టం ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని కలెక్టర్ వీరపాండియన్ తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా, ఎవరైనా ప్రభుత్వం/జిల్లా యంత్రాంగం అనుమతి లేకుండా అనధికారికంగా కోవిడ్ ఆస్పత్రులు లేదా కోవిడ్ కేర్ సెంటర్స్ నడిపితే క్రిమినల్ కేస్ పెడతాం... సీజ్ చేయిస్తామని కలెక్టర్ వీరపాండియన్ హెచ్చరించారు.

## ప్రస్తుతం భారత్‌లో డేంజర్ పరిస్థితి: కేఏపాల్

(మొదటి పేజీ తరువాయి)

నిన్న డూప్లికేట్, డాక్టర్లు, పోలీసులను పంపించి కేజీహెచ్‌లో తనను చంపడానికి ప్రయత్నించవద్దని... డాక్టర్‌ని పంపించవద్దని తాను కేజీహెచ్‌కు వెళ్లనని... తనను చంపిన ఇక్కడే దీక్ష చేస్తానని స్పష్టం చేశారు. బీపీ, షుగర్ లెవెల్ బానే ఉన్నాయన్నారు. "నేను గతంలో ఉపవాస దీక్షలు చేశాను.. నాకు గురించి ఏమి భయపడక్కర్లేదని... నాకేం కాదు..వాయిదా వేయండి నేనే మీ ఇంటికి వచ్చి కలుస్తాను" అని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనాను అరికట్టడంలో విఫలమయ్యారని కేఏ పాల్ విమర్శలు గుప్పించారు.

## వైసీపీని,బలరాంను వీడనన్న మాజీమంత్రి డాక్టర్.పాలేటి



చీరాల(ఒంగోలు) : పార్టీ మారే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, చీరాల నియోజకవర్గ వైసిపి నాయకుడు డాక్టర్ పాలేటి రామారావు స్పష్టం చేశారు. ఇటీవలికాలంలో డాక్టర్ పాలేటి తెలుగుదేశంపార్టీలోకి వెళ్లబోతున్నట్లు మీడియాలో కథనాలురాగా వాటిని ఆయన ఖండించారు. స్థానిక శాసనసభ్యుడు కరణం బలరామ్‌తోనే తన పయనం కొనసాగుతుందని స్పష్టం చేశారు.బలరాం రాకతో చీరాలలో అరాచక పాలనకు తెర పడిందని, ప్రజలందరూ సంతోషంగాఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఎప్పుడూ కోరుకునే తాను, అందుకు కారకుడైన బలరాంతోనే పయనిస్తాను తప్ప, ఇంకో పార్టీలోకి వెళ్లే ప్రసక్తి లేదని, వైసిపిని వీడబోనని తేల్చి చెప్పారు.బలరాం వెంట ఉన్న వైసిపి నేతలందరూ కలిసికట్టుగా ఉండటంతోవారిలో చీలికతేవాలన్న ఉద్దేశంతో,ఇలాంటి కుట్రకథనాలు ఒక వచ్చాయన్నారు.అయితే 2024 ఎన్నికల్లో బలరాం కుమారుడు వెంకటేష్‌కి, చీరాల వైసిపి టిక్కెట్టు ఇప్పించి,ఆయన గెలుపునకు కృషి చేస్తామని డాక్టర్ పాలేటి ప్రకటించడం కొసమెరుపు.

## పొన్నూరు లో కోవిడ్ చికిత్సా కేంద్రం ప్రారంభం

పొన్నూరు, ప్రజా పాలన ప్రతినిధి: పొన్నూరు శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య శనివారం స్థానిక నిడుబ్రోలు గవర్నమెంట్ హాస్పిటల్ నందు ఏర్పాటు చేసిన నూతన కోవిడ్ సెంటర్ ను ప్రారంభించారు. తదనంతరం స్థానిక నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన క్వారంటైన్ సెంటర్ ను సందర్శించి 96 పడకలు గల గదులను పరిశీలించారు. దీనికి కావలసిన అన్ని సదుపాయాలును యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయవలసినదిగా సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గ ప్రజలుకు కోవిడ్ సెంటర్ మరియు క్వారంటైన్ సెంటర్ రెండు అందుబాటులో ఉండటం వల్ల ఈ రెండిటి సదుపాయాలను ఉపయోగించుకొని కరోనాను రూపుమాపు టకు రూపొందించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఒక హెడ్ క్వార్టర్ లో ఇలా కోవిడ్ సెంటర్లు ఏర్పాటు చేయడం ఎంతో ఆనందదాయకం అన్నారు. ప్రజలందరూ, అందుబాటులో గల ఈ సదుపాయాలను ఉపయోగించుకుని ఈ కరోనా మహమ్మారిని రూపు మాపుదామని చెప్పారు. తదనంతరం హాస్పిటల్ కోవిడ్ సిబ్బందికి, నోడల్ అధికారి కి తగు సూచనలు – సలహాలు ఇచ్చి యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు డాక్టర్ రత్నరాజు, డాక్టర్ నూరుల్ హుదా, డాక్టర్ రేష్మా, తహశీల్దార్ డి.పద్మనాభుడు, వైకాపా నాయకులు కొల్లేరు శ్రీనివాసరావు, డాక్టర్ ఎన్. రూత్ రాణి, షేక్ నాజర్, చిగురుపాటి సుబ్బారావు, యామిని శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.





## వైయస్సార్ కాంగ్రెసు పార్టీ ఆఫీసు నందు మేడు వేడుకలు

సత్తనపల్లి, మే 01, ప్రజాపాలన ప్రతినిధి:ఈ రోజు పట్టణ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు వల్లెం నరసింహారావు గారి ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ శాసనసభ్యులు అంబటి రాంబాబు గారు హాజరై కార్మికుల జెండా ఆవిష్కరణ చేసారు. అనంతరం అంబటి రాంబాబు గారు మాట్లాడుతూ కార్మికులు హక్కులు సాధన కోసం కార్మికుల ఐక్యత కోసం ప్రపంచ మొత్తం ఈరోజు కార్మికుల దినోత్సవం జరుపుకోనటం గొప్ప విషయం అని మాట్లాడురు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర వైసిపి కార్యదర్శి నిమ్మకాయల రాజనారయణ గారు, మున్సిపల్ ఛైర్మన్ చల్లంచర్ల తులసి సాంబశివరావు గారు, మార్కెట్ యార్డు ఛైర్మన్ రాయపాటి పురుషోత్తం గారు, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ గార్లపాటి ప్రభాకర్ గారు,రాష్ట యస్. సి. సెల్ నాయకులు కోడిరెక్క దేవదాసు, మున్సిపల్ కౌన్సిలర్లు అచ్యుత శివప్రసాద్, శిరిగిరి వెంకటరావు, లిఅంచులవారిలి లిపాలెంగ్రామలి లిసర్పంచ్లి లిఅంచులరామాంజనీయులులి పట్టణ వైయస్సార్ సిపి నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, ఆకుల హనుమంతరావు, తలతల బాస్కరరెడ్డి,చిలుక రమణయ్య, శివాపురం రామారావు,, ఉల్లంగుల ప్రసాద్, సహర మౌలాలి,సంకుల తిరుమలరావు, పెద్దింటి వెంకటేశ్వర్లు ,మందడపు సాయి తదితరులు పాల్గొన్నారు.

## కరోనాపై అవగాహన



రాజుపాలెం, మే 01, ప్రజాపాలన ప్రతినిధి:నూతన సర్పంచ్ పులి బండ్ల అశోక్ కుమార్ మాట్లాడుతూ కరోనా ప్రభావం చాలా తీవ్రంగా ఉన్నదని ప్రతి ఒక్కరూ మాస్కు ధరించి భౌతిక దూరాన్ని పాటించాలని చేతుల్ని పరిశుభ్రంగా మన దగ్గర ఉన్న సోపుతో గాని శానిటేషన్ తో గాని శుభ్రం చేసుకోవాలని ఆయన కోరారు అదేవిధంగా రాజుపాలెం మండల కేంద్రంలోని పురవీధుల్లో బ్లీచింగ్ తో శానిటేషన్ చేయించి ప్రజలు ఏ విధంగా ఉండాలో సూచించారు.

## కరోనా సోకి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన అంబటి



సత్తనపల్లి, మే 01, ప్రజాపాలన ప్రతినిధి: సత్తెనపల్లి శాసన సభ్యులు అంబటి రాంబాబు గారు, సత్తెనపల్లి ప్రభుత్వం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కరోనా సోకిన వారిని స్వయం గా పలకరించి, మీకు అండగా మేము ఉన్నాం అని తెలియాయజేసి, ప్రతి పేషంట్ యొక్క ఆరోగ్య పరిస్థితిని దగ్గరుండి డాక్టర్ చేత రిపోర్ట్ చేసుకొని, వారికి కావాల్సిన సౌకర్యాలను చూడాలని ఆదేశించారు.

## రిమ్స్ వైద్య శాలకు 50 బెడ్లు అందించిన మాగుంట రాఘవరెడ్డి



ఒంగోలు మే 1 ( ప్రజా పాలన)ప్రకాశం జిల్లాలో కోవిడ్ రోజు రోజు కి పెరిగిపోతుండడం మరియు రిమ్స్ తదితర వైద్యశాలలో బెడ్ల మరియు ఆక్సిజన్ తీవ్ర కొరత తో కోవిడ్ రోగులు పడుతున్న బాధలు ప్రసార మాధ్యమాల ద్వారా చూసి ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, తనయుడు మాగుంట రాఘవరెడ్డి, శనివారం ఉదయం 11 గంటలకు, 50 నూతన బెడ్లు జిల్లా జాయింటు కలెక్టర్, చేతన్ సమక్షంలో రిమ్స్ వైద్యశాలకు మాగుంట కార్యాలయ సిబ్బంది ద్వారా అందించారు. రాఘవరెడ్డి కోరిక మేరకు ప్రతి రోజూ 14 , ఆక్సిజన్ సిలెండర్లు రిమ్స్ కు అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం లో జాయింటు కలెక్టర్, రిమ్స్ సూపరింటెండెంట్ డా. శ్రీరాములు , రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డా. టి. మురళి కృష్ణారెడ్డి, ఆర్.యం.వో., డా. వేణుగోపాలరెడ్డి, రిమ్స్ వైద్యశాల కోవిడ్ ఇంచార్జి, మరియు మాగుంట కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు



# ఎఐటియుసి, సిపిఐ, ఆధ్వర్యంలో.. మేడే వేడుకలు

సత్తనపల్లి, మే 01, ప్రజాపాలన ప్రతినిధి:135 వ ప్రపంచ కార్మిక దినోత్సవం పురస్కరించుకొని సత్తెనపల్లి ఏరియా ఎఐటియుసి, సిపిఐ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో అమరావతి బస్టాండ్ పాయింట్లో ఎఐటియుసి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని సిపిఐ కోశాధికారి సీనియర్ జర్నలిస్టు కె.కె మూర్తి జెండా ఆవిష్కరించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద హైయిర్ బస్ వర్కర్స్ యయూనియయన్ ఆధ్వర్యంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. సిపిఐ కార్యాలయం పై ఎఐటియుసి నాయకులు అంజి రెడ్డి జెండాను ఆవిష్కరించారు. లెనిన్ నగర్ లో సిపిఐ ఆధ్వర్యంలో శాఖ కార్యదర్శి నరసింహారావు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం ఎందరో మహానుభావులు పోరాటాల ఫలితంగా కార్మికుల హక్కులను సాధించుకున్న ఈనాడు ప్రభుత్వను పాలిస్తున్న వాళ్లు కార్మికుల చట్టాలను తూట్లు పొడుస్తున్నారని వాటిని హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పాత చట్టాలను అమలు చేయాలని శ్రీనివాస్ కోరారు. కరోనా కాలంలో కార్మికులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గరికపాటి రవి కుమార్, ఎస్ టి యు జిల్లా నాయకులు జి. సల్మాన్ రాజ్ ఎఐటియుసి ఏరియా ప్రధాన కార్యదర్శి పి.యిర్మియ, ఎఐటియుసి పట్టణ అధ్యక్షులు డి. ఆర్. మస్తాన్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల ఆనంద్, ఆటో యూనియన్ నాయకులు బి. గోపి, డి. బాబు, దార శ్రీను, చిలకా గిత్తన్, పంతులు, అనిల్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



## చేబ్రోలు లో ఘనంగా మే డే ఉత్సవాలు



చేబ్రోలు, మే 01, ప్రజాపాలన ప్రతినిధి: మండల కేంద్రమైన చేబ్రోలు మెయిన్ రోడ్ లో గల బస్టాండ్ వద్ద రిక్షా కార్మికుల ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మేడే జెండాను ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులను నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కాలరాస్తున్న ని, కరొన కాలంలో కష్టాల్లో ఉన్న కార్మికులను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులను ఆధునిక బానిసలుగా చేసే చట్టాలకు రూపకల్పన చేయడం, కార్మికుల పట్ల బిజెపి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థం అవుతుందని, మేడే స్ఫూర్తితో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని, కార్మిక హక్కులను కాలరాస్తుంది అని ఆయన అన్నారు అదేవిధంగా కార్పొరేట్లకు దోచిపెట్టే కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికవర్గం సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు, కరోనా నివారణకు ఇచ్చే టీకా ప్రజలందరికీ ఉచితంగా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్.కె.మస్తాన్ వలి, పి.చౌడయ్య, సుబ్బారావు, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు

## ఏపీ కి 470 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ కేటాయింపు:కృష్ణబాబు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి :ఆంధ్ర ప్రదేశ్ కు 470 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ కేంద్రం కేటాయించినట్లు కోవిడ్ కేర్ సెంటర్స్ ప్రత్యేక అధికారి కృష్ణబాబు తెలిపారు. రాష్ట్రంలో 20 వేల మందికి ఆక్సిజన్ అందిస్తున్నామని చెప్పారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నుంచి 70 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ వస్తోందన్నారు. దేశంలో ఇతర ప్రాంతాలు నుంచి 170 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ వస్తోందని తెలిపారు. దేశంలో సుదూర ప్రాంతాలు నుంచి మరో 220 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ రానున్నట్లు వెల్లడించారు. ఒరిస్సాలోని టాటా స్టీల్ ప్లాంట్, ఏఎస్‌డబ్ల్యూ నుంచి అంకురు ఆక్సిజన్ ఫిల్లింగ్ స్టేషన్‌లో 100 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్‌ను ఏపీ కి కేటాయించారన్నారు. విజయవాడ నుంచి ఒరిస్సా వెళ్లాలంటే 4 రోజులు పడుతుంది కాబట్టి సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక విజ్ఞప్తి మేరకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కార్గో విమానం కేటాయించారని తెలిపారు. రెండు ట్యాంకర్‌లు ఒకటి 18 మెట్రిక్ టన్నులు, మరొకటి 28 టన్నుల ట్యాంకర్ కెపాసిటీ పంపించామని ,వచ్చిన ఆక్సిజన్ సక్రమంగా వినియోగించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి కార్గో విమానం బయలుదేరి వెళ్తోందని చెప్పారు. గ్రీన్ ఛానెల్ ద్వారా ఆక్సిజన్ వాహనాలు వచ్చేందుకు ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేస్తున్నామని కృష్ణబాబు పేర్కొన్నారు.

## నకరికల్లులో ఘనంగా కార్మిక దినోత్సవం



నకరికల్లు, మే 01, ప్రజాపాలన ప్రతినిధి: మేడే సందర్భంగా కార్మిక దినోత్సవాన్ని పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నకరికల్లులోని పంచాయతి ఆఫీస్ సెంటర్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. సభకు పిడీఎం జిల్లా నాయకులు షేక్ మస్తాన్ వలి అధ్యక్షత వహించారు. సీపి ఎం నాయకులు ఈవూరి లక్ష్మా రెడ్డి, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సైదా, మాలమహానాడు సత్తెనపల్లి నియోజకవర్గం ఇంచార్జి గోదా బాల, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ ఫలితమే మే డే అని అన్నారు. పారిశుధ్య కార్మికులకు మాస్కులు, గ్లౌజులు, శానిటేషన్ పరికరాలు ఇవ్వాలని, సత్వరమే వారికి కరోనా టీకా వేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల వేతనాలు పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ముందుగా ఎర్రజెండా ఎగురవేసి అమరులకు నివాళులు అర్పించారు.

## 'పాలకులారా ఒక్కసారి ఆలోచించండి ....!



బాపట్ల మే 01, ప్రజాపాలన ప్రతినిధి: విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం వద్దు విద్యార్థులు వారి తల్లిదండ్రులు కరోనా భయంతో వణికిపోతున్నారు పిల్లల భవిష్యత్తు కోసం పరీక్షలు పెడతామని మీరు అంటున్నారూనీ భవిష్యత్ కన్నా ముఖ్యం ప్రాణం .. ప్రాణాలు కాపాడుకోవడం మరొక్కసారి మీ నిర్ణయాన్ని పునఃపరిశీలించండి పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులతో కలుపుకుని 50 లక్షల మందికి పైగా కరోనా బారిన పడతారు ఆ ప్రమాదాన్ని ఊహించుకుంటేనే భయమేస్తుంది ఆస్పత్రులలో ఆక్సిజన్ అందక కళ్ళముందే అయిన వారిని పోగొట్టుకుంటున్నారు విద్యార్థుల రేపటి భవిష్యత్తు కాపాడాలి.అంటే ఈ రోజు ఒక సంవత్సరం లేటు అయిన పర్వాలేదు పరీక్షలు దయచేసి రద్దు చేయండి ఇది విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రుల మనోగతం దయచేసి కరోనా బారిన పడకుండా విద్యార్థులను రక్షించండి ప్రభుత్వ పెద్దలు మరొక్కసారి ఆలోచించండి



## మాస్క్ కవచం..మనం- మన పరిశుభ్రత

బెల్లంకొండ: (ప్రజా పాలన) మండలంలోని న్యూచిట్యాల గ్రామపంచాయతీ పరిధిలో శనివారం నాడు మాస్క్ కవచం మనం మన పరిశుభ్రత అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి న్యూ చిట్యాల సర్పంచ్ బాణవత్ నరసింహ నాయక్ పాల్గొన్నారు నరసింహ నాయక్ మాట్లాడుతూ మాస్క ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ధరించాలని లేనియెడల వైరస్ ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి వ్యాపిస్తుందని కరొన వైరస్ సోకిన వ్యక్తి నుండి మరో వ్యక్తికి శ్వాస ద్వారా అతివేగముగా వైరస్ సోకుతుంది వారు తెలిపారు అదే విధముగా ప్రతి ఇంటి నుండి తడి మరియు పొడి చెత్తను సేకరించడం జరుగుతుంది అని ప్రజా భాగ్య స్వామ్యం తో వ్యర్థ రైహిత పారిశుద్ధ్య గ్రామము గా మార్పు చేయాలని ప్రతి ఒక్కరూ గ్రామ పంచాయితీ తమదిగా భావించాలని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఈ కరుణ మహమ్మారి తో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా వహించాలని అవసరమైతేనే బయటికి రావాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ. సచివాలయ సిబ్బంది ఉప సర్పంచ్ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## ఘనంగాశ్రీగురు విశ్వ స్పూర్తి వారి 81వ జన్మదిన వేడుకలు



పెనుగంచిప్రోలుమే 01, ప్రజాపాలన ప్రతినిధి:శ్రీగురు విశ్వ స్ఫూర్తి వారి 81 వ జన్మదిన వేడుకలుపెనుగంచిప్రోలు లో ఘనంగా జరిగాయి తెల్లవారుజామున ప్రత్యేక పూ జలు నిర్వహించారు,దంపతులు గురువు జన్మ దినం సందర్భంగా గురువు ఆసీనులైన ఫోటో వద్ద పుష్ప గుచ్ఛం ఉంచి గురు స్ఫూర్తి వారికి జన్మదిన శుభాకాం క్షలు తెలిపారు,పిల్లలతో గురువుగారి జన్మ దినోత్సవ కేకులు కట్ చేయించారు,పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి ముఖ్యఅతిథిగా ఈ కార్యక్ర మంలో పాల్గొని పిల్లలతో గురు విశ్వ స్ఫూర్తి వారి జ న్మదిన కేకును కట్ చేయించారు, ముఖ్య అతిధులు జ్యోతి ప్రజ్వలన చేశారు ఈ కార్యక్రమంలో పలువురు గురువు గారి అభిమానులు పాల్గొన్నారు.




# ప్రజాపాలన

## సంపాదకీయం

**ఆదివారం 02, మే 2021**

# పరీక్షలు .. ప్రస్తుత పరిస్థితులు ...

ఇప్పటికే అరకొర వసతులతో తక్కువ సమయంతో తరగతులు నడిపిన ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలు మరో రెండు నెలల పాటు విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా క్లాసులు నిర్వహించి రెండు నెలల తర్వాత పరీక్షలు జరిపితే బాగుంటుంది. విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలు పెరుగుతాయి కదా ! ఆ వైపుగా ప్రభుత్వం ఎందుకు ఆలోచించడం లేదు? ఇప్పటికిప్పుడు పరీక్షలు జరపాలని అంత అత్యవసర పరిస్థితి ఏమిటి? ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పది పరీక్షను రద్దు చేసింది. చాలా రాష్ట్ర ప్రభుత్వాలు పరీక్షలు రద్దు చేశాయి అయినా మన రాష్ట్రంలో ఇలా ఎందుకు జరుగుతోంది ?

కరోనా సెకండ్ వేవ్ నేపథ్యంలో దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల నిర్వహణ, కుంభమేళా లాంటి ఉత్సవాలు జరిగిన తీరు, ఆ తర్వాత కోవిడ్ విజృంభించిన పరిస్థితులు మనం గమనిస్తున్నాం. వీటిని గమనించిన అంతర్జాతీయ మీడియా మోడీ ప్రభుత్వాన్ని ఎలా ఎండగట్టిందీ కూడా చూశాం. మోడీ సర్కారు నిర్వాకాన్ని బట్టబయలు చేస్తూ వార్తలు, కథనాలు రావడం లేదంటూ జాతీయ మీడియా చెందిన పాత్రికేయులు వారి సంపాదకులను నిలదీశారు. ప్రజల పక్షాన మనం నిలబడాల్సిన సమయంలో మన బాధ్యతల నుంచి మనం తప్పు కుంటున్నామంటూ లేఖలు రాశాయి. మొన్న తమిళనాడు హైకోర్టు కరోనా సెకండ్ వేవ్ ఉధృతికి అసలైన కారణం కేంద్ర ఎన్నికల సంఘం అంటూ వారి మీద హత్య కేసు ఎందుకు పెట్టకూడదని నిలదీసింది. నిన్న పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఏకంగా ఎన్నికల సంఘం మీద మర్డర్ కేస్ పెట్టమంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రంలో వరుసగా జరిన స్థానిక సంస్థల ఎన్నికలతో కరోనా బారినపడిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు మొన్న జరిగిన తిరుపతి ఉప ఎన్నికలతో 75 శాతం పైగా మంచాన పడిపోయారు. సెలవులు లేవు. వైద్య సదుపాయాలు లేవు. టెన్త్ క్లాస్ వరకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు కచ్చితంగా పాఠశాలకు వెళ్లాల్సిందే. మినహాయింపు లేదు. ఇలాంటి ఒత్తిడిలో ఉపాధ్యాయులు మరణించిన తీరు కూడా మనం చూశాం. ఇవన్నీ పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం తగుదునమ్మా అంటూ రాష్ట్రంలో పది, ఇంటర్మీడియట్ పరీక్షలు జరిపి తీరాల్సిందే అంటూ పట్టుపట్టింది. ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్ని వినతులు సమర్పించుకున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదు. వారి పని వారు చేసుకుంటూ పోతున్నారు. కోవిడ్ విద్యార్థులకు మరోసారి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ఉన్నవారికి వేరే గది కేటాయిస్తామంటున్నారు. మరి కోవిడ్ లక్షణాలు పైకి కనిపించని విద్యార్థుల పరిస్థితి ఏమిటి? లక్షణాలు బైటపడకుండా రోగంతో వచ్చి పాల్గొంటున్న సిబ్బందిని గుర్తించడం ఎలా? 11 లక్షల మంది విద్యార్థులు వారి కోసం వచ్చే తల్లిదండ్రులు విధులు నిర్వర్తించడానికి వచ్చే సిబ్బంది రవాణా సదుపాయాల మాటేమిటి? వారితో పాటు ప్రయాణించే ఇతర ప్రయాణీకుల పరిస్థితి ఏమిటి? వీటన్నిటికీ ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా పరీక్ష మాత్రమే నిర్వహిస్తే మా పని అయిపోతుంది అన్నట్లు ప్రభుత్వం వ్యవహరిస్తుండడం తగదు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ చట్టం-2005 ను అనుసరించి కరోనా మహమ్మారి విజృంభించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ 26 ఏప్రిల్ 2021లో జారీ చేసిన జీవో మేరకు జిమ్ లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ లు వంటివి వెంటనే మూసివేయాలని, 50 మందికి మించి జనసమూహాలు ఉండకూడదని, మాస్కులు, శానిటైజర్ తప్పనిసరిగా ఉండాలని, ప్రజా రవాణా 50 శాతం మాత్రమే ప్రయాణికులు ఉండాలని మనిషికి మనిషికి ఐదు అడుగుల దూరం ఉండాలని జీవో పేర్కొంది. అదే రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు వారు మొదటి, రెండవ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కు సంబంధించి సుమారు 11 లక్షల మంది విద్యార్థులు 1450 సెంటర్లు, 3500 మంది సిబ్బందితో ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఒక్కో సెంటర్లో 400 నుంచి 500 మంది విద్యార్థులు అదే సంఖ్యలో వారి తల్లిదండ్రులు మరియు సిబ్బందితో కలుపుకుని సుమారు 1000 మంది ఒకే చోట చేరుతున్న పరిస్థితి. ఇది కేంద్ర ప్రభుత్వం 2005 కేంద్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మరియు ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ వారు కరోనా మహమ్మారి కట్టడికి తీసుకున్న చట్టపరమైన చర్యలకు విరుద్ధం కాదా? ఇదే అంశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులకు వ్యతిరేకం కాదా ? కరోనా మహమ్మారి నుంచి విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉద్యోగులను కాపాడవలసిన బాధ్యత ఇంటర్మీడియట్ బోర్డు అధికారుల మీద ఉంది. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డు అధికారుల మీద నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ 2005 చట్టం క్రింద కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ "ది ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్" లేఖ కూడా రాసింది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం గురువారం జరుపతలపెట్టిన మంత్రివర్గ సమావేశాన్ని సైతం కేవలం 30 మంది మంత్రులు ఒక దగ్గరకి రాకూడదనే ఉద్దేశంతోనే వాయిదా వేసినప్పుడు ఇంటర్మీడియట్ పరీక్షలు వాయిదా వేయడంలో తప్పేముంది? కోవిడ్ నిబంధనలు పాటిస్తామనుకుని చెప్పే పని అయితే నిబంధనలు ఎంతవరకు విద్యార్థులకు రక్షణ ఇస్తాయి? మాస్క్ వేసుకుంటారు, భౌతిక దూరం పాటిస్తారు. అంతటితో సరిపోతుందా? థర్మల్ స్కానర్ ద్వారా జ్వరం ఉన్న వాళ్ళని గుర్తిస్తారు. మరి జ్వరం వచ్చిన విద్యార్థి టాబ్లెట్ వేసుకుని పరీక్షకు వస్తే థర్మల్ స్కానర్ గుర్తించగలదా? జ్వరం వచ్చిన తర్వాత లక్షణాలు ఉన్నట్లు మనం గుర్తిస్తాం కానీ జ్వరం రాకముందు లక్షణాలు తీవ్రంగా ఉండి ఆ తదుపరి జ్వరం వస్తున్నట్లు ఇటీవల వైద్యులు చెబుతున్నారు. మరి వారి పరిస్థితి ఏమిటి? అంటే జ్వర లక్షణాలు రాకముందే ఎంతో మందికి ఈ వ్యాధిని తెలియకుండానే సంక్రమింప చేసి ఉండొచ్చు. ఇలాంటి ప్రత్యేక కేసులకు పరిష్కారం ఏమిటి? మరో విద్యార్థి ఆరోగ్యం బాగా ఉండి పరీక్ష రాయడానికి వస్తాడు. పైకి లక్షణాలు కనిపించని విద్యార్థితో చనువుగా ఉండటం వల్ల, మరే కారణం ద్వారా అయినా ఆ విద్యార్థికి వ్యాధి సంక్రమిస్తుంది. తదుపరి ఐదు రోజుల తర్వాత పరీక్ష రాయలేకపోతే మధ్యలోనే పరీక్ష నుండి ముగించుకొని వెళ్ళవలసి వస్తుంది. ఆ విద్యార్థి అప్పుడు ఉత్తీర్ణత పొందలేడు. విద్యార్థి బాగా ఉండి కూడా పరీక్షలు రాయడానికి వచ్చి జబ్బున పడినట్లే కదా! ఇక్కడ ఏ తప్పు చేయని విద్యార్థి పరీక్ష రాయడానికి వచ్చి మాత్రమే కదా జబ్బు పడ్డాడు. ఇప్పటికే అరకొర వసతులతో తక్కువ సమయంతో తరగతులు నడిపిన ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలు మరో రెండు నెలల పాటు విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా క్లాసులు నిర్వహించి రెండు నెలల తర్వాత పరీక్షలు జరిపితే బాగుంటుంది.

విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలు పెరుగుతాయి కదా! ఆ వైపుగా ప్రభుత్వం ఎందుకు ఆలోచించడం లేదు? ఇప్పటికిప్పుడు పరీక్షలు జరపాలని అంత అత్యవసర పరిస్థితి ఏమిటి? ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పది పరీక్షను రద్దు చేసింది. చాలా రాష్ట్ర ప్రభుత్వాలు పరీక్షలు రద్దు చేశాయి. అయినా మన రాష్ట్రంలో ఇలా ఎందుకు జరుగుతోంది? ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా ప్రభుత్వం పరీక్షల నిర్వహణ విషయం పునరాలోచించాలని వ్యాఖ్యానించింది. ఈ పరిస్థితిలో మనం ఏది అనుకుంటే అదే చేద్దాం అనే ఏకపక్ష విధానాన్ని ప్రభుత్వం విడనాడి పరీక్షలను వాయిదా వేయాలి. తద్వారా విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి.

## నవ్వులను మింగేస్తున్న కరోనా మహమ్మారి..!

**(నేడు 'ప్రపంచ నవ్వుల దినోత్సవం' సందర్భంగా)**

నేటి ఆధునిక యాంత్రిక మార్పులేవీ లేని వేగవంతమైన జీవన విధానంలో సంతృప్తిగా నవ్వగలిగే సందర్భాలు చాలా అరుదుగా కనిపిస్తున్నాయి. మనస్ఫూర్తిగా నవ్వటంతో పలు శారీరక మానసిక అస్వస్థతలకు ఉపశమనం సిద్ధిస్తుందని నమ్మిన పలు జనసమూహాలు నవ్వుల క్లబ్‌లను నెలకొల్పి 'లాఫింగ్ యోగా' సాధన మరియు 'లాఫ్టర్ థెరపీ' చేస్తున్నారు. మనస్ఫూర్తిగా నవ్వగలగడం ఓ మంచి అమూల్య వరం. మానవాళి సమగ్ర శ్రేయస్సుకు మరియు క్షేమానికి నవ్వులు ఉచిత దివ్య ఔషధాలుగా పని చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా నవ్వుల ప్రాధాన్యతను గుర్తించిన సమాజం ప్రతిఏటా మే మాసపు తొలి ఆదివారం, అనగా 02 మే 2021న 'ప్రపంచ నవ్వుల దినం' నిర్వహిస్తున్నారు. 10 జనవరి 1998 రోజున ముంబాయ్ పట్టణంలో డా: మదన్ కటారియా చొరవతో 'నవ్వుల యోగా ఉద్యమం' ప్రారంభించారు. దైనందిన జీవితంలో నవ్వడానికి కారణాలను వెదకాలే కాని బాధలను వెతికి వెతికి మోయడం సరి కాదు. ప్రతికూల సమస్యల సాధన సమయంలో నవ్వులను ఆశ్రయించడం ఉత్తమంగా పాటించాలి. మానసిక ఒత్తిడిని మాయం చేయగల మహత్తర శక్తి నవ్వులకు ఉంటుంది. పట్టణాల్లోని పార్కుల్లో ప్రతి రోజు ఉదయం వ్యాయామ సమయంలో 'లాఫింగ్ క్లబ్'ల ద్వారా జోక్స్ చెప్పుకుంటూ మనసారా నవ్వుకోవడం జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఐదు ఖండాల్లో 6000లకు పైగా లాఫింగ్ క్లబ్బులు విస్తరించబడి ఉన్నాయి. నవ్వడం వల్ల అనేక అనారోగ్యాలు మాయమవుతాయనే ప్రచారంతో 'లాఫ్టర్ థెరపీ' కూడా బహుళ ప్రచారం పొందింది. 'వరల్డ్ లాఫ్టర్ డే' సందర్భంగా నవ్వుల ప్రాధాన్యతలను తెలిపే ప్రసంగాలు, జోక్స్ చెప్పి నవ్వించడం, శాంతి ర్యాలీలు, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, పలు ఆసక్తికర హాస్య కార్యక్రమాలు నిర్వహిస్తారు.

నవ్వు ఓ అద్భుత ఉచిత దివ్య ఔషధం. నవ్వుల సుగుణాలతో మానవ సంబంధాలు, ప్రపంచ శాంతి, సోదరభావం, స్నేహబంధాలు లాంటి ప్రయోజనాలు ఉన్నాయి. దినచర్యలో సదా నవ్వగలిగిన వారు చాలా అదృష్టవంతులుగా మరియు ఆరోగ్యవంతులుగా అందరినీ దృష్టిని ఆకర్షిస్తారు. నవ్వడం మరియు నవ్వులు పంచడమే జీవిత పరమార్థంగా బ్రతకడం అలవర్చుకోవాలి. నవ్వడంతో శారీరక వ్యాయామం జరిగి జీవ వ్యవస్థ సర్దుకుంటుంది. ఆశావహ దృక్పథం కలిగిన వ్యక్తులు ఎల్లవేళల నవ్వు ముఖంతో అందంగా ఉంటారు. నవ్వుల వల్ల వ్యాధి నిరోధకశక్తిని పెంచే టి-కణాలు ఉత్తేజితం అవుతాయి. నవ్వడం వల్ల రక్త ప్రసరణ సక్రమంగా జరిగి గుండె మరియు ఊపిరితిత్తులకు ఆరోగ్యం సిద్ధిస్తుంది. నవ్వడం వల్ల కండరాలకు వ్యాయామం కలుగుతుంది. శరీరంలోని స్ట్రెస్ హార్మోన్స్ మోతాదు తగ్గుతుంది. అధిక రక్తపోటును తగ్గించడానికి నవ్వడమనే ఔషధాన్ని వాడాలి. నవ్వటం వల్ల ఎండార్ఫిన్ ఉత్తేజితం కావడంతో నొప్పులకు తాత్కాలిక ఉపశమనం కలుగుతుంది. ప్రతి రోజు 10 – 15 నిమిషాలు నవ్వటంతో దాదాపు 40 కాలరీలు ఖర్చు అవుతుంది. కోపం, ఉద్రేకం, ఆందోళన, ఒళ్లు నొప్పులు తగ్గుతూ జీవితకాలం పెరుగుతుంది. జ్ఞాపకశక్తి, సృజనశీలత, మానవ సంబంధాలు, ప్రాణవాయువు సరఫరాలను పటిష్ట పరిచే సహజ వ్యాయామంగా నవ్వులు ఉపయోగపడతాయి. కాన్సర్ థెరపీకి లాఫింగ్ సహకరిస్తుంది.

కరోనా మహమ్మారి విజృంభనతో మానవాళి వైరస్ భయంతో, పరిమిత కదలికలతో సంతోషంగా గడపడం కష్టంగా ఉన్నది. ఈ కరోనా రెండవ అల రేపిన దుస్థితిలో ఆనంద క్షణాలు హరించుకు పోతున్నాయి. కరోనా సోకుతుందనే భయం కన్న ప్రచార మాధ్యమాల 'కరోనా వార్తల సునామీ'తో మానసికంగా కుంగి పోతున్నారు. ఈ విపత్కర విపత్తును అధిగమించడానికి ధైర్యంగా, సంతోషంగా కాలం గడపడం అత్యవసరంగా భావించాలి. మానసిక దృఢత్వానికి నవ్వులతో స్నేహం చేయడం ఉత్తమం. మనం నవ్వితే మన చుట్టు ఉన్న సమాజం కూడా నవ్వుతుంది. నవ్వటంతో మనలో శారీరక వాంఛనీయ మార్పులు జరగడమే కాకుండా మన తోటి ప్రపంచంలో సానుకూల మార్పులు వస్తాయి. నవ్వుకు సమాధానం నవ్వే అని గుర్తుంచుకోవాలి. 'కరోనా పాండెమిక్'కు సరైన సమాధానం 'హాపీ-డెమిక్' అని మరువరాదు. నవ్వుల పుష్కల పంటలు లేని జీవితం కరువుకాటకాలతో సమానమని అర్థం చేసుకోవాలి. నవ్వుల సంపదలు లేని జీవితం నరక సమానం. నవ్వటం నాలుగు విధాల చేటు కాదని, పలు విధాల మేలని గుర్తుంచుకుంటూ, సదా నవ్వుతూ, నవ్వులను పంచుదాం. నవ్వటం ఓ యోగం, నవ్వకపోవడం ఓ రోగం అని మరువ వద్దు.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**కరీంనగర్ – 9949700037**

## కోవిడ్ బారినుండి ఉపాధ్యాయులను రక్షించాలి..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరోనా సెకండ్ వేవ్ ఉధృతిలో ఎంతో మంది ఉపాధ్యాయులు కరోనా బారిన పడుతున్నారు. ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు కేటాయించడం జరిగింది. దీనిలో భాగంగా పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల తోపాటుగా, ఎం.పి.టి.సి., జడ్.పి.టి.సి. ఎన్నికలు మరియు తిరుపతి ఉప ఎన్నికలకు విధులకు హాజరైనారు. ముందస్తు చర్యలుగా ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి కొంతమందికి వ్యాక్సినేషన్ చేసినప్పటికీ, పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులందరికీ వ్యాక్సిన్ ప్రక్రియ పూర్తి చేయకుండానే ఎన్నికల విధులు కేటాయించారు. అందువల్ల ఉపాధ్యాయులు విపరీతంగా కరోనా బారిన పడ్డారు. ఇంకా పడుతూనే ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు ఉపాధ్యాయులే 150 మంది వరకు మరణించారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే క్రమంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర ఉంది. అందువలన ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రత్యేక కోవిడ్ సెంటర్‌ను వంద పడకల పైగా గల ఐ.సి.యు. మరియు వెంటిలేటర్ సౌకర్యం గల సెంటర్‌ను ప్రతి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసి ఉపాధ్యాయ వర్గాన్ని ఆదుకోవాలి. కోవిడ్ దృష్ట్యా ఈ.హెచ్.ఎస్. అనుమతులు కలిగి ఉన్న హాస్పిటల్స్ వెళ్ళిన బెడ్స్ ఖాళీగా లేవు అని వెనుకకు పంపుతున్నారు. ఉపాధ్యాయులను వెంటనే ఆసుపత్రుల్లో చేర్చుకొని చికిత్స అందించేలా ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఆసుపత్రులకు ఇవ్వాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. స్కూళ్లు మూసివేసి సెలవులు ప్రకటించినప్పటికీ, యుడైస్ అప్డేషన్, స్కూల్ మరియు హ్యాబిటేషన్ డెవలప్మెంట్ ప్లాన్స్ తయారీ, నాడు నేడు, రికార్డ్ వర్క్స్, ఘ కొలతలు, స్టూడెంట్ ప్రమోషన్ లిస్ట్ తయారీ, డ్రైరేషన్ విద్యార్థులకు అందించుట వంటి అదనపు పనులను కేటాయించడం వల్ల ఉపాధ్యాయులు మానసిక వ్యధకు గురి అవుతున్నారు. కాబట్టి కరోనా తగ్గేవరకు అనవసరమైన రిపోర్టులు కోరవద్దని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల ప్రాణరక్షణకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి అమలు పరచాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ప్రస్తుతం



ప్రభుత్వం ఇంటర్, పదవ తరగతి పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరుపుతామని చెపుతోంది. దాని ప్రకారం చర్యలు తీసుకుంటోంది. ఈ కరోనా విపత్కర పరిస్థితుల్లో పదో తరగతి, ఇంటర్ పరీక్షల ఇన్విజిలేటర్ విధులు నిర్వర్తించలేమని, ఈ ఇన్విజిలేటర్ విధులకు వ్యాక్సిన్ ప్రక్రియ పూర్తయిన సిబ్బందిని మాత్రమే ఉపయోగించుకొని తమ ప్రాణాలు కాపాడాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. లేనిచో ఉపాధ్యాయుల అందరికీ వ్యాక్సిన్ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత మాత్రమే విధులు కేటాయించాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయులను ఫ్రంట్ లైన్ వారియర్స్ గా గుర్తించి వెంటనే, వయస్సుతో సంబంధం లేకుండా ప్రభుత్వ మరియు ప్రైవేటు స్కూళ్ళలో, కాలేజీల్లో పనిచేసే బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బందికి వెంటనే వ్యాక్సిన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు తీసుకొని ఉపాధ్యాయుల ప్రాణాలు కాపాడాలి.

**– వాసిలి సురేష్**
**9494615360**

# బైడెన్ ఎజెండా

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత అమెరికన్ కాంగ్రెస్ ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి బైడెన్ చేసిన తొలి వార్షిక ప్రసంగం అగ్రరాజ్యం ఎదుర్కొంటున్న దుస్థితికి అద్దం పడుతున్నది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల పట్ల నిబద్ధతను చాటుకునేందుకు బైడెన్ దీనిని ఒక అవకాశంగా ఉపయోగించుకున్నారు. కరోనా విపత్తును ఎదుర్కోవడంలో, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో ట్రంప్ కన్నా మెరుగు అనిపించినా, విదేశాంగ విధానంలో మాత్రం తేడా ఏమీ లేదని ఆయన ప్రసంగం స్పష్టంగా తెలియజేస్తోంది. దశాబ్దాలుగా అమెరికా అధ్యక్షులు చేస్తూ వస్తున్న వార్షిక ప్రసంగాలు తంతుగా మారిన స్థితిలో బైడెన్ ప్రసంగం దీనికి కొంచెం భిన్నంగా ఉందనే చెప్పాలి. అమెరికా నేడు విపత్తు లాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నదని, మహా ఆర్థిక మాంద్యం తరువాత మళ్లీ అంతటి ఆర్థిక సంక్షోభం తలెత్తిందని బైడెన్ చెప్పడం ఒకింత ఆశ్చర్యం కలిగించింది. అంతకన్నా ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే అమెరికా అధ్యక్షుడి నోటి నుంచి సంపద కేంద్రీకరణ అన్న మాటలు రావడం. కరోనా, ఆర్థిక సంక్షోభం దెబ్బకు 2 కోట్ల మంది అమెరికన్లు ఉద్యోగాలు పోయాయని, అదే సమయంలో 650 మంది బిలియనీర్ల సంపద లక్ష కోట్ల డాలర్లకు పైగా పెరిగిందని బైడెన్ చెప్పారు. అమెరికాలో వాస్తవిక పరిస్థితిని ఆయన సరిగానే తెలియజేశారు. ఈ అసమానతల పెరుగుదలపై అమెరికన్లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్న బైడెన్, దీనికి ఉపశమనంగా అమెరికన్ జాబ్స్ ప్లాన్, అమెరికన్ ఫ్యామిలీ ప్లాన్ అన్న రెండు పథకాలను ముందుకు తెచ్చారు. ఇప్పటికే 1.9 లక్షల కోట్ల డాలర్లతో కరోనా సహాయక ప్యాకేజీని తెచ్చి ఒక్కొక్క అమెరికన్‌కు 1400 డాలర్లు చొప్పున 16 కోట్ల కుటుంబాలకు ఆర్థికసాయం అందించిన బైడెన్ ఇప్పుడీ రెండు ప్రణాళికలకు మరో రెండు లక్షల కోట్ల డాలర్లు కేటాయించాలని నిర్ణయించారు. జాబ్స్ ప్లాన్ కింద దేశంలో రేవులు, విమానాశ్రయాల ఆధునీకరణ, బ్రాడ్‌బాండ్, వంతెనలు, సబ్‌వేలు వంటి మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నారు. ఫ్యామిలీ ప్లాన్ కింద అమెరికన్ల విద్య, వైద్యం, శిశు సంక్షేమానికి ప్రాధాన్యమివ్వనున్నారు. వీటికి అవసరమైన నిధులను సమకూర్చేందుకు కార్పొరేట్లపై పన్నును 21 శాతం నుంచి 28 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు. 21వ శతాబ్దిలో అమెరికా గెలవాలంటే సంపన్నులపై పన్నులు వేయక తప్పదని అన్నారు. ప్రపంచంపై అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సమర్థించుకోవాలంటే అంతర్గత పరిస్థితి మెరుగుపరచుకోవడం అవసరమని బైడెన్ భావించాడు. అందుకే ఒక వైపు అమెరికన్ల సామాజిక, ఆర్థిక పరిస్థితి మెరుగుదలపై దృష్టి సారిస్తూనే, మరో వైపు అమెరికన్ పాలకవర్గాల ఎజెండాను ముందుకు తీసుకెళ్లే ద్విముఖ వ్యూహాన్ని అనుసరించారు. బైడెన్ ప్రసంగంలో చైనా గురించి ఓ అరడజను సార్లకు పైగా ప్రస్తావించారు. 'నిబంధనల ఆధారంగా నడుస్తున్న అంతర్జాతీయ క్రమాన్ని' చైనా సవాల్ చేస్తోందని బైడెన్ మరోసారి తన అక్కసు వెళ్లగక్కారు. ప్రపంచంపై సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని చలాయించేందుకు ఉద్దేశించిన ఈ ప్రపంచ క్రమాన్ని అమెరికానే రుద్దింది. అలాంటప్పుడు దీనిని ఏ దేశమైనా ఎందుకు అంగీకరించాలి? చైనాతో ఘర్షణ కోరుకోవడం లేదంటూనే దక్షిణ చైనా సముద్ర జలాల్లోకి అమెరికా తన యుద్ధ నౌకలను దింపుతూ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. చైనాకు వ్యతిరేకంగా ఇండో పసిఫిక్ వ్యూహంలో కీలక భాగస్వామిగా ఉన్న భారత దేశ ప్రాదేశిక సముద్ర జలాల్లోకి తన యుద్ధ నౌకలను పంపింది. అమెరికా చెబితే తప్ప ఈ విషయం భారత ప్రజలకు తెలియలేదు. చైనా నెంబర్ వన్ ప్రపంచ ఆర్థిక శక్తిగా అవతరిస్తుందని ఐఎంఎఫ్ హెచ్చరించిన నేపథ్యంలో ఆ దేశాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా పావులు కదుపుతున్నది. ఆఫ్ఘనిస్తాన్ నుంచి అమెరికా దళాల ఉపసంహరణను ఏదో ఘనకార్యమన్నట్లుగా బైడెన్ ప్రకటించడం హాస్యాస్పదం. ఆఫ్ఘనిస్తాన్‌పై రెండు దశాబ్దాలపాటు యుద్ధం కొనసాగించిన అమెరికా 2,400 మంది సైనికులను పోగొట్టుకుని, 2 లక్షల కోట్ల డాలర్లను తగలేసి చివరికి సాధించిందేమిటి?

# కలుషిత తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**డీపీఆర్ తయారు చేయాలని మంత్రి కొడాలి నాని ఆదేశం**



గుడివాడ, మే 01, ప్రజాపాలన ప్రతినిధి:మల్టీ విలేజ్ స్కీంతో దాదాపు 60 వేల నుండి 80 వేల మంది జనాభాకు తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించే పనిలో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) నిమగ్నమయ్యారు. ఈ మేరకు అవసరమైన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ను వెంటనే తయారు చేయాలని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను మంత్రి కొడాలి నాని ఆదేశించారు. గుడివాడ రూరల్, నందివాడ మండలాల్లోని అనేక గ్రామాల్లో చేపల చెరువుల కారణంగా తాగునీరు కలుషితమైంది. ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటి పథకాలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలకు పరిశుభ్రమైన నీరు సరఫరా కావడం లేదు. కాల్వల ద్వారా వచ్చే నీటితో మంచినీటి చెరువులను నింపుతున్నప్పటికీ చుట్టూ చేపల, రొయ్యల చెరువులు ఉండడం వల్ల ఆ నీరు కొద్ది రోజుల్లోనే తాగడానికి పనికి రాకుండా పోతోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ప్రజలు తాగునీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ రూరల్, నందివాడ మండలాల్లోని అన్ని గ్రామాలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలన్న కృతనిశ్చయంతో మల్టీవిలేజ్ స్కీంను అమలు చేసేందుకు మంత్రి కొడాలి నాని చర్యలు చేపట్టారు. రెండు మండలాలకు మంచినీటిని సరఫరా చేసేందుకు అనువైన ప్రాంతంలో భూమిని సేకరించడంపై దృష్టి పెట్టారు. మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి ఎంత భూమి అవసరం అవుతుంది. ఏ మండలానికి ఎంత తాగునీటిని సరఫరా చేయాలి తదితర విషయాలకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ను తయారుచేసి వెంటనే తనకు అందజేయాలని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మంత్రి కొడాలి నాని ఆదేశాలతో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మల్టీ విలేజ్ స్కీంకు సంబంధించిన ప్రతిపాదనలను తయారు చేస్తున్నారు. గుడివాడ నియోజకవర్గానికి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా ఉన్న కొడాలి నాని గత 25 ఏళ్ళుగా తన సొంత ఖర్చులతో అవసరమైన ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తూ వస్తున్నారు. గుడివాడ రూరల్, నందివాడ మండలాల్లో ప్రజల తాగునీటి అవసరాలపై పూర్తి అవగాహన కల్గివున్న మంత్రి కొడాలి నాని మల్టీ విలేజ్ స్కీం ద్వారా తాగునీటి సమస్యకు పరిష్కారం చూపనున్నారు.

## కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు కరోనా మృతికి కనీస స్పందన కరువే - సిపిఐ , ఏఐటియుసి



జగ్గయ్యపేటమే 01, ప్రజాపాలన ప్రతినిధి:కేంద్ర ప్రభుత్వం ఫ్రంట్ లైన్స్ వారియర్స్ అని,రాష్ట్ర ప్రభుత్వం కరోనా సేవ లంటూ పొగుడుతూ సంఘటిత,అసంఘటిత కార్మి కులను మరియు పాత్రికేయ రంగాలలో పని చేస్తున్న వారిని శ్రమకు మించి పని చేయించుకుంటుంద ని, 1886 మే 1 వ తేదిన అమెరికా దేశం చికాకో నగ రంలో జరిగిన పనిగంటలపై,శ్రమ దోపిడీపై కార్మికులు పోరాడి సాదించుకున్న పనిగంటలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడంతో కరోనా వైరస్ పుణ్యమా అం టూ కార్మికుల శ్రమదోపిడిని,పనిగంటలను కేంద్ర,రా ష్ట్ర ప్రభుత్వాలు ఎలా దోచుకుంటున్నాయ్నో స్పష్టంగా కనబడుతుందని సిపిఐ జగ్గయ్యపేట పట్టణ కార్యద ర్శి జూనెబోయిన శ్రీనివాసరావు అన్నారు,కార్మిక,కర్ష కులకు సంక్షేమ పథకాలు,ఉద్దీపన పథకాలంటూ కేం ద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఊదరగొడుతూ కార్మికులను మ్షెసం చేస్తున్నాయని ఆయన అన్నారు,జగ్గయ్యపేట ప్రాంతంలో సంఘటిత రంగంలో పనిచేస్తూ గతంలో చిల్లకల్లు యస్ఐ 2 గా దుర్గారావు,మున్సిపల్ కార్మి కురాలు జమ్మి పుల్లమ్మ,అంగన్ వాడీగా విధులు ని ర్వహిస్తున్న వాణీ,ఆర్.టి.సి లో కండక్టర్ గా పనిచే స్తున్న లవంగం కిరణ్,పాత్రికేయునిగా పనిచేయున్న అల్లూరి శ్రీనివాసరావు,వీరే కాకుండా గోల్డ్ స్మిత్ కార్మి కులు,చేతివృత్తిదారులు ఈ కరోనా మహమ్మారికి బలై ప్రాణాలను కోల్పోయి కుటుంబాలు రోడ్డుపాలైన దృ శ్యాలు హృదయాని కలిచివేస్తుందని ఆయన అన్నా రు,ప్రభుత్వ,ప్రైవేట్, అసంఘటిత, చేతివృత్తి,పాత్రికేయ రంగాలలో ఎంతో మంది పని చేస్తున్న వారెందరో జగ్గయ్యపేట ప్రాంతంలో కరోనా బారిన పడుతూ ఉచిత వైద్యం అందకపోవడం మూలానా ట్రీట్ వెంట్ కొరకు లక్షల రూపాలయ డబ్బులు పోగొట్టుకొని ఆర్థి కంగా ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వాలకు చీమ కుటిన్నట్లుగా కూడా లేదని ఆయన వ్యక్తం చేసారు, ఇప్పటికైన కార్మికుల పక్షపాతమని చెప్పుకుంటున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా ఎమర్జెన్సీ సంధర్భం లో నైన సంఘటిత,అసంఘటిత,పాత్రికేయులకు కా ర్మికుల పట్ల మానవత కోణంలో కరోనాతో మృతి చెం దిన కుటుంబాల వారికి అండగా ఉండక పోవడం వా రి కుటుంబాలు వీధి పాలైయ్యేలా ప్రభుత్వ తీరున్నద ని,వెంటనే కార్మికులకు పొగడ్తలు,సన్మానాలు కాదని కరోనా బారిన పడిన,పడుతున్న కార్మికులను,కర్షకుల కు ఉచిత వైద్య సేవలను అందించాలని, ఇప్పటి వర కు కరోనా వల్ల మరణించిన వారి కుటుంభాలకు ప్రభు త్వం ఆర్థిక సహాయాని అందించాలని,మండల తహ సీల్థార్ కార్యాలయంలో డిటి నాగరాజు కి సిపిఐ పట్ట ణ,ఏఐటియుసి నియ్జెజకవర్గ సమితి నాయకులు జూనెబోయిన శ్రీనివాసరావు,అంబోజి శివాజీ, పోతు పాక వెంకటేశ్వర్లు,షేక్ అబ్దుల్ కరీమ్,మెటికల శ్రీనివా సరావు లు కలసి వినతి పత్రాని సమర్పించారు.

## మురళీ మోహన్ సైలెంట్ వెనుక



విజయవాడ, మే 1, :రాజకీయాల్లో ఎప్పుడు ఎలాంటి పరిణామాలు జరుగుతాయో చెప్పలేం. ఇక, వ్యాపారం పరంగాకూడా అంతే. ఏదైనా చేసేటప్పుడే.. సదరు వ్యవహారంపై [illegible] పట్టుసాధించాలని నాయకులు భావిస్తారు. వ్యాపారంలో.. రాజకీయంలో ఆధిపత్యం సహజం. అయితే తమ పార్టీనే అధికారంలో ఉన్నా.. ఒక్కొక్కసారి తప్పటడుగులు వేస్తుంటారు. లేదా.. పార్టీ అధినేతలను ఒప్పించలేకపోతుంటారు. దీంతో సదరు నేతలు ఇప్పుడు జగన్ సర్కారు చేతిలో నలిగిపోతున్నారు. తాజాగా వెలుగు చూసిన ఓ విషయం చాలా విస్మయానికి దారితీసింది.టీడీపీలో సీనియర్ నాయకుడు, రాజమండ్రి నుంచి 2014లో విజయం దక్కించుకున్న సినీ నటుడు మాగంటి మురళీమోహన్‌కు జగన్ ప్రభుత్వం బాగానే వాత పెట్టిందని.. అధికార వర్గాల్లో చర్చ నడుస్తోంది. దీనిపై అటు మురళీ మోహన్ కూడా ఎక్కడా యాగీ చేయకుండా.. సైలెంట్‌గా జగన్ ప్రభుత్వం చెప్పినట్టే నడుచు కున్నారని.. ఇక, టీడీపీ నేతలు సైతం ఎక్కడా దీనిని వివాదం చేయలేదని అంటున్నారు. విషయంలోకి వెళ్తే.. మాగంటి మురళీ మోహన్ సినిమాల్లో సంపాయించుకున్న సొమ్ముతో జయభేరి అనే నిర్మాణ సంస్థతో రియల్ ఎస్టేట్ బిజినెస్ కూడా చేశారు.ఈ క్రమంలో మురళీమోహన్ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక.. రాజధాని ప్రాంతం అమరావతిని దృష్టిలో ఉంచుకుని.. గుంటూరు జిల్లా (విజయవాడ బోర్డర్) తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లి ప్రాంతంలో.10 ఎకరాల వ్యవసాయ స్థలం కొన్నారు. వాస్తవానికి ఇది వ్యవసాయ సాగు భూమి. అంటే.. ఈ భూమిలో ఎలాంటి నిర్మా ణాలు చేపట్టకూడదు. ముఖ్యంగా నివాసాలకు అసలు వాడకూడదు. అయితే.. ఇలా వాడుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకుని, ల్యాండ్ కన్వర్షన్ యాక్ట్ ప్రకారం వ్యవసాయేతర భూమిగా మార్చు కుంటే సరిపోతుంది.మరి ఈ విషయంలో మాగంటికి చంద్రబాబు ప్రభుత్వం పెద్ద దెబ్బ వేసేసింది. ఈ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలంటూ.. పెట్టుకున్న అర్జీని దాదాపు మూడు సంవత్సరాల పాటు తొక్కి పెట్టింది. దీనికి కారణాలు ఏమిటో తెలియదు. సరే.. 'ప్రభుత్వం మనదే కదా!' అనుకున్న మురళీమోహన్ ఆ భూమిలో భారీ ఎత్తున అపార్ట్‌మెంట్లు కట్టేశారు. ఇక, ఆ తర్వాత జగన్ ప్రభుత్వం వచ్చే వరకు ఈ భూమి తాలూకు వివాదాన్ని చంద్రబాబు సర్కారు పరిష్కరించలేదు.ఇక, జగన్ సర్కారు.. ఈ ఏడాది ప్రారంభంలోనే దీనిపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే మురళీ మోహన్‌కు నోటీసులు జారీ చేయడమే కాకుండా.. సుమారు రూ.2 కోట్ల రూపాయల వరకు ఫైన్ విధించింది. దీంతో ఈ విషయంలో చేతులు కాలాయని భావించిన మురళీ మోహన్.. ప్రభుత్వం వేసిన ఫైన్ చెల్లించి చాలా సైలెంట్ అయిపోయారు. ఇక, ఇదే విషయం తెలిసినప్పటికీ.. టీడీపీ నేతలు మౌనంగా ఉండడం గమనార్హం. మొత్తానికి తాజాగా వెలుగు చూసిన ఈ విషయం.. రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

## మేడే స్ఫూర్తితో మరింత ముందుకు సాగుదాం:సిఐటియు



వత్సవాయి, మే 01, ప్రజాపాలన ప్రతినిధి:వత్సవాయి గ్రామంలో సిఐటియు ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు,ఈ సందర్భంగా సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి బి.రాము మాట్లాడుతూ ప్రపంచ కా ర్మిక వర్గ దీక్షా దినం మేడే. కష్టం కార్మికులది సౌఖ్యం పెట్టుబడిదారులకు ఇటువంటి వ్యవస్థ మారాలి శ్ర మజీవుల ఐక్యం కావాలి,సంవత్సర కాలంగా కరోనా తో ప్రజలు కార్మికుల జీవితాలు అతలాకుతలం అ వుతున్న ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాను మోడీ ప్రభు త్వం కార్పొరేట్ల సేవలో మునిగి తేలుతుందని కార్మికు ల ప్రాథమిక సమస్యలు కూడా పరిష్కరించడం లేద ని వివిధ పథకాల స్కీమ్ వర్కర్స్ ను కార్మికులుగా గుర్తించడం లేదని కాంట్రాక్టు వ్యవస్థ రద్దు చేయాలని కార్మిక హక్కులు రక్షణ పూర్తి బాధ్యత ప్రభుత్వం క ల్పించాలని కార్మికులకు రక్షణగా ఉన్న కార్మిక చట్టా లను మార్చకూడదని యూనియన్ పెట్టుకోవడం స మ్మెకు పనిగంటలు పీఎఫ్ ఈఎస్ఐ తదితర హక్కుల కు భంగం కలిగిస్తూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా లేబర్ కో డ్ లు తెచ్చింది పర్మినెంట్ ఉద్యోగుల స్థానంలో కొద్ది కాలం పాటు ఉండే ఫిక్సిడ్ టెర్మ్ పద్ధతిని ప్రవేశపెట్టి కార్మికులు ఉద్యోగుల తొలగింపును చట్టపరంగా చే సిందని ఈ చట్టాల్లో మార్పులు చేయాలని లేకుంటే రానున్న రోజుల్లో కార్మికులను ఏకం చేసి ఈ చట్టలు రద్దు మోడీ గద్దెదిగే వరకు మేడే స్ఫూర్తితో పోరాడతా మని డిమాండ్ చేశారు,సీఐటీయూ మండల అధ్యక్షు రాలు నాగేశ్వరి సీఐటీయు అనుబంధ సంఘాల నా యకులు .కార్మికులు కంచర్ల కొండయ్య, గంగుల వెంకటేశ్వర్లు, దేవయ్య, ప్రసాదు రామారావు శ్రీను లుర్ధూ, అనూష, వేణు వెంకటేశ్వర్లు, అజయ్, జ్యోతి శైలజ, సుజాత రాధా పాల్గొన్నారు

## వైయస్సార్ జలకళ ప్రారంభించిన గ్రామ సర్పంచి వేల్పుల పద్మ కుమారి



పెనుగంచిప్రోలువే 01, ప్రజాపాలన ప్రతినిధి: పెనుగంచిప్రోలు గ్రామంలోని ఈ రోజు జగనన్న నవరత్నాలలో భాగంగా వైయుస్సార్ జలకళ కార్యక్రమని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి ఈ కార్యక్రమా న్ని ఉద్దేశించిగ్రామ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి మాట్లాడుతూ,జగనన్న నవరత్నాల కార్యక్రమం ఒక భాగంగా తన తండ్రి దివంగత నేత డాక్టర్ వైయస్ రా జశేఖర్ రెడ్డికి రెట్కతులు సమస్యలు తెలిసిన నేతమాజీ ముఖ్యమంత్రి కావున ఆయన పేరుతోనే మన యువ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తండ్రి పేరు నిలబడాలని తనయుడుగా,వైయస్సార్ జల పథకం అని పెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అ ని సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి అన్నారు,ఈ కా ర్యక్రమానికి ముఖ్య అతిథులుగా,పెనుగంచిప్రోలు మండల అభివృద్ధి అధికారి బి.రాజు,జాతీయ ఉపాధి హామీ ఏవో తిరుపతి రావు,ఉపాధి హామీ మీ ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్,రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేష న్ డైరెక్టర్ చేని కుమారి,పెనుగంచిప్రోలు మండలం వై యస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వ ర రావు,పెనుగంచిప్రోలు మండల ఆర్ బి కె చైర్మన్ చుం చు బెనర్జీ, పెనుగంచిప్రోలుపట్టణ అధ్యక్షులు కాకానీ హరి, వార్డ్ నెంబర్లు, కార్యకర్తలు నాయకులు పాల్గొ న్నారు.

## జీతాలు ఇవ్వని ప్రైవేటు ఇంజినీరింగు కళాశాలలపై చర్యకు ఉపక్రమించండి

**ప్రొ. బాయినేని. నాగేంద్ర ప్రసాదు, కార్యదర్శి ప్రైవేటు ఇంజినీరింగు కళాశాలల అధ్యాపకుల సంఘం.. హైదరాబాదు**

**శ్రీ బి చాంద్ బాషా, ప్రధాన కార్యదర్శి, ప్రవేటు కళాశాలల అధ్యాపకేతర సంఘం - హైదరాబాదు.**

అనంతపురం, మే 01, ప్రజాపాలన ప్రతినిధి:జీవితంలో పెద్ద తప్పు చేశామా అంటే ? బాగా చదువుకోవడం - ఇంకా బ్లండర్ ఏదైనా ఉందా అంటే - ప్రైవేటు కళాశాలల్లో పని చేయడం.

తెలంగాణాలో దాదాపు 150 కాలేజీలు మీ ఎంఎల్ఏ లవి, ఎంపి, ఎంఎల్సి లవి మీ మంత్రులవని ప్రజలందరికి తెలిసిన విషయమే. గత పద్నాలుగు నెలలుగా జీతాలివ్వని కళాశాలలపై చర్యలకు ఎందుకు ఉపక్రమించరు? ప్రైవేటు ప్రొఫెషనల్ మరియు ఇంజినీరింగ్ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకుల, అధ్యాపకేతర సిబ్బంది అవస్థలు చెప్పనలవి కాదు. దాదాపు నలభై శాతం అధ్యాపకులు తొలగించారు. నలభై శాతం కళాశాలలకు అధ్యాపకులు అవసరమే లేదు. మిగిలిన ఇరభై శాతం కళాశాలలు అధ్యాపకులకు కంటితుడుపు చర్యగా కేవలం వారికి బ్రతకడానికి 30 శాతం జీతం ఇస్తూ కాలం గడుపుతున్నారు. మిగతా జీతం ఎప్పుడిస్తారు అన్న ప్రశ్నకు సమాధానం లేదు. ఎవరైనా అధ్యాపకులు గొంతెత్తి మాట్లాడితే ఉద్వాసనకు గురికాక తప్పదు. రెండు సంవత్సరాలైనా ఉపకులపతులను నియమించక, ఏళ్ళు గడుస్తున్నా అధ్యాపక పోస్టులు భర్తీ చేయక మీన మేషాలు లెక్కిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గు ఎగ్గూ లేకుండా పోయింది. ఫ్యాక్ట్ ఫైండింగ్, ఇన్స్పెక్షన్స్, అఫిలియేషన్ ఇచ్చే జె ఎన్ టి యు విశ్వవిద్యాలయ అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేదు. ఇక విద్యాశాఖ మంత్రికి కళాశాలలకు సంబంధం లేని వ్యక్తిగా మారారు. విద్య ప్రమాణాలు పెంచాలి, ప్రపంచంలోనే తెలంగాణ తలమానికంగా మారాలి అన్న స్పృహ ప్రభుత్వానికి లేనట్టు ఉంది. ఇన్స్పెక్షన్ వారం రోజులు ముందు రిక్రూట్మెంట్ నెల తర్వాత రిట్రెంచ్మెంట్. బయోమెట్రిక్ అటెండన్స్ యదానికి తంబు బ్యాచ్. దొంగ డిగ్రీలను రాటిఫై చేయించిన ఘనత మన మంత్రులది. డబ్బిస్తే దేనికైనా సంసిద్ధం అంటారు మన విశ్వవిద్యాలయ అధికారులు. లక్షకు పైగా అధ్యాపకులు హైదరాబాదు నగరంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, ప్రొఫెషనల్ కాలేజీలలో పనిచేస్తున్నారు. వీరందరూ అసంఘటిత కార్మికులకంటే హీనంగా ఉన్నాయి వీరి బ్రతుకులు. కార్మికులకు, కర్షకులకు, వలస కూలీలకు, దినసరి కలీలకు కనీసం రేషన్ కార్డు, జబ్బొస్తే ఆరోగ్యశ్రీ కార్డు లన్నా ఉన్నాయి వీరికి ఏ కార్డు లేదు. వీరి పిల్లలకు ఎలాంటి భరోసా లేదు. వీరితో గ్రాడ్యుయేట్ శాసన మండలికి ఓటు వేయించుకోవడం తప్ప సమాజంలో వీరితో ఉపయోగంలేదు. వీరికి అప్పు కూడా పుట్టదు. బ్యాంకులలో లోను ఇవ్వడం ఆపేశారు. కరోనా ముందు వీరు తీసుకున్న ఇంటి లోను, పర్సనల్ లోను, వాహన లోను రాబట్టడానికి మంచి దేహదారుఢ్యం ఉన్న వ్యక్తులను రిక్రూట్ చేసుకొని వీరి ఇళ్ల దగ్గరకు రికవరీకి పంపుతున్నారు. వీరి సిబిల్ స్కోరు లేదు, శాలరీ సర్టిఫికెట్ ఇవ్వరు, క్రొత్త అప్పు పుట్టదు. పిల్లల చదువుకు, ఆరోగ్యానికి, రవాణాకు చేతిలో చిల్లి గవ్వ లేక దుర్భరమైన జీవితం గడుపుతున్నారు. చివరికి అడుక్కుతిని బ్రతుకుదామంటే తమ విద్యార్థుల కంట పడితే హీనంగా ఉంటుందని సంకోచిస్తున్నారు. దయచేసి గౌరవ ముఖ్యమంత్రి గారు తమ మంత్రులకు, కళాశాలల యజమాన్యానికి తక్షణమే బకాయి ఉన్న జీతము చెల్లించవలసినదిగా కోరడమైనది. తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ ఈటెల రాజేందర్ మెదక్ జిల్లాలోని హకీంపేట శివారులల్లో భూమిని కబ్జా చేశారని ఆ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కరోనా బారిన పడ్డ మన ముఖ్యమంత్రి గారికి విన్నవించుకుంటే సారు తక్షణమే సదరు మంత్రిగారి కొలువు తీసివేసి తన దగ్గర ఉంచుకొని మంత్రి మీద చర్యలకు ఉపక్రమించమని సిఎస్ గారికి ఆదేశాలిచ్చారు. సత్వరమే విద్యాశాఖ మాత్యులు శ్రీమతి సబిత ఇంద్ర రెడ్డి గారిని తొలగించి అధ్యాపకులకు జీతాలు సక్రమంగా ఇవ్వని కళాశాలలను బ్లాక్ లిస్టులో ఉంచామని కోరడమైనది. ఆలా కాని పక్షంలో అధ్యాపకుల ఆకలి చావులకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సివస్తుంది.

## మెడికల్ దందాపై నిఘా

విజయవాడ, మే 1, :ష్ట్రంలో కోవిడ్ బాధితులకు ఇచ్చే రెమ్‌డెసివిర్ ఇంజక్షన్ల బ్లాక్‌మార్కెటింగ్‌పై అధికారులు నిఘా పెంచారు. ఈ ఇంజక్షన్లను అక్రమంగా విక్రయిస్తున్న నలుగురిని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పట్టుకున్నారు. ఈ ఇంజక్షన్‌ను కొందరు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై ఔషధ నియంత్రణశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా సీ అండ్ ఎఫ్, హోల్‌సేల్ షాపులతో పాటు, ప్రైవేటు ఆస్పత్రులపైనా నిఘా పెట్టారు. గుంటూరులో బుధవారం ఓ వ్యక్తి 6 ఇంజక్షన్లు తీసుకెళుతుండగా పట్టుకున్నారు. వాటిని సీజ్ చేసి పట్టుకున్న వ్యక్తిని విచారిస్తున్నారు.గుంటూరు జిల్లా నరసరావుపేటలోని ఒక ఆస్పత్రి ఐసీయూలో రోగులకు ఇవ్వాల్సిన ఇంజక్షన్లను బయటకు తీసుకొచ్చి విక్రయిస్తున్న ముగ్గురు మేల్ నర్సింగ్ సిబ్బందిని పట్టుకున్నారు. 7 డోసుల ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ రెండు ఘటనల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు నిఘా పెంచారు. రెమ్‌డెసివిర్ ఇంజక్షన్లు కేవలం కోవిడ్ అనుమతి ఉన్న ఆస్పత్రులకు మాత్రమే పంపిణీ జరగాలని, ప్రైవేటుగా ఎవరైనా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోల్‌సేలర్లు, రిటెయిలర్లు కూడా ఇంజక్షన్ల లెక్క చెప్పాలని ఆదేశించారు. గుంటూరులో బ్లాక్ మార్కెట్‌లో ఇంజక్షన్ల విక్రయాల్లో వైద్యుల ప్రమేయం ఉన్నట్టు నగరంలోని వైద్యుల సంఘంలో గురువారం విస్తృతంగా చర్చ జరిగింది.



# వేస్టేజ్ కట్టడికి పక్కా ప్లాన్

విజయవాడ, మే 1, :రాష్ట్రంలో కోవిడ్ నియంత్రణకు సంబంధించి ప్రతి అంశంలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించారు. మూడంచెల వ్యూహంతో ముందుకెళుతున్నారు. మందులు, ఆక్సిజన్, వ్యాక్సిన్ ఇలా అన్ని విషయాల్లోనూ తక్షణమే వృథా (వేస్టేజీ)ను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి విభాగంలోనూ కొంతమంది అధికారులను పర్యవేక్షణకు నియమించారు. ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. వృథాను అరికట్టడం ద్వారా వేలాది మంది పేషెంట్లకు అదనంగా వైద్యసేవలు అందించే అవకాశం ఉంటుంది.వాస్తవానికి కరోనా నియంత్రణకు ఇచ్చే రెమ్‌డెసివిర్ ఇంజక్షన్లు ఇతర రాష్ట్రాల్లో కంటే ఏపీలో ఎక్కువ ఉన్నాయి. కానీ కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చిన ఇంజక్షన్లు దాచేసి బ్లాక్‌మార్కెట్‌కు తరలించి కృత్రిమ కొరత సృష్టించారు. దీన్ని మొదట్లోనే గుర్తించిన ఔషధ నియంత్రణ అధికారులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రెమ్‌డెసివిర్‌లను ఎలా? ఎవరికి ఉపయోగించారు? అన్నదానిపై ఆడిట్ చేస్తున్నారు. ఉదాహరణకు ప్రైవేటులో పదివేల పడకలు ఉంటే అందరికీ రెమ్‌డెసివిర్‌ల అవసరం ఉండదు. దీన్నిబట్టి ఎలా చేశారన్నది అంచనా వేయవచ్చు. ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే స్టాకును ఏరోజు కారోజు నివేదిక తెప్పించి పరిశీలిస్తున్నారు. ఒక్క ఇంజక్షన్ తేడావచ్చినా ఆయా ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటారు.దేశవ్యాప్తంగా ఆక్సిజన్ కొరత వేధిస్తోంది. ఏపీలో సరిపడా నిల్వలు ఉన్నప్పటికి కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొంతమంది వైద్యులు ఆక్సిజన్ శాతం 96గా ఉన్న పేషెంట్లకు కూడా ఆక్సిజన్ ఇస్తున్నారు. దీంతో నిజంగా ఆక్సిజన్ అవసరమైన వారికి ఆలస్యం అవుతోంది. దీంతో ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా ఆక్సిజన్ నిర్వహణకు జిల్లాల వారీగా, ఆస్పత్రుల వారీగా ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు ఎప్పటికప్పుడు ఆక్సిజన్ నిల్వలను పర్యవేక్షిస్తున్నారు.కరోనా వ్యాక్సిన్ వేయడమనేది తొలిసారి. ఇందులో సిబ్బందికి ఎంతగా శిక్షణ ఇచ్చినా కూడా వృథా జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 27 నాటికి 7.93 శాతం వృథా అయినట్టు తేలింది. వ్యాక్సిన్ మొదలుపెట్టిన తొలిరోజుల్లో వేయించుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఒక వయెల్ ఓపెన్ చేస్తే కనీసం 10 మందికి వేయవచ్చు. కానీ ఒక్కరే వస్తే 9 మందికి వేసే డోసు వృథా అవుతుంది. ప్రస్తుతం వ్యాక్సిన్‌పై అందరికీ అవగాహన పెరిగి, వేయించుకోవడానికి సిద్ధపడుతున్న నేపథ్యంలో వ్యాక్సిన్ల వృథా ఉండదని అంచనా. మరింత పక్కా ప్రణాళికతో వృథా పునరావృతం కాకుండా కార్యాచరణ చేపట్టారు.

# పరువు అన్న మాట తమ్ముళ్ల నోట..

విశాఖపట్టణం, మే 1, :ఉత్తరాంధ్ర అంతటా ఓడిపోతేనేమి. మెగా సిటీ విశాఖలోని నాలుగు దిక్కులా పసుపుదనం నిండుగా పరచుకుంది అన్న సంబరం తమ్ముళ్ళకు అట్టే కాలం నిలవలేదు. పేరుకే నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు విశాఖ మేయర్ సీటు వైసీపీకి దక్కడంతో పోయిందిగా పరువు అన్న మాట తమ్ముళ్ళ నోట వినిపిస్తోంది. ఇక విశాఖ సిటీలో కూడా గట్టిగా కాలు పెట్టేసిన వైసీపీ అంతటితో ఊరుకుంటుందా టీడీపీ ఎమ్మెల్యేల ఆధిపత్యానికి గండి కొడుతూ జోరుగా దూసుకుపోతోంది.విశాఖ పశ్చిమ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యేగా పెతకంశెట్టి గణబాబు ఉన్నారు. ఆయన తండ్రి పెతకంశెట్టి అప్పలనరసింహం ద్రోణంరాజు సత్యనారాయణ స్థాయి నాయకుడు. కాంగ్రెస్ లో ఉంటూ టీడీపీ పెట్టడంతో అందులోకి వచ్చిన తొట్ట తొలి నేత. ఎన్టీయార్ ఆయన్ని గౌరవించి ఎమ్మెల్యేగా, ఎంపీగా చేశారు. ఇక ఆయన వారసుడిగా వచ్చిన గణబాబు ఇప్పటికి మూడు విడతలుగా ఎమ్మెల్యేగా నెగ్గుతూ వచ్చారు. మధ్యలో ప్రజరాజ్యం పార్టీలోకి వెళ్ళినా కూడా మళ్లీ సైకిలెక్కేశారు. ఇలా టీడీపీ నుంచే ఆయన విజయాలు అందుకున్నారు. ఇపుడు ఆ పశ్చిమ టీడీపీ కోటకే బీటలు వారిపోతున్నాయని తమ్ముళ్ళు తెగ పరేషాన్ అవుతున్నారు.పశ్చిమ నుంచి గణబాబుని వైసీపీలోకి చేర్చుకోవాలని అప్పట్లో కొంత ప్రయత్నం జరిగింది. మొదట్లో ఆయన ఏమనుకున్నారో కానీ కొంత సైలెంట్ అయ్యారు. దాంతో పార్టీ వారికి కూడా అనుమానం వచ్చింది. మళ్ళీ ఆయన టీడీపీలో యాక్టివ్ అయినా మునుపటి జోరు కనిపించడంలేదు. ఇదే అదనుగా వైసీపీ అక్కడ దూకుడు పెంచేసింది. మహా విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో మెజారిటీ వార్డులను ఇక్కడ గెలుచుకుని సిట్టింగ్ టీడీపీ ఎమ్మెల్యేకు గట్టి దెబ్బ కొట్టేసింది. ఇపుడు వరసగా టీడీపీలోని బలమైన నాయకులను వైసీపీలోకి చేర్పించే పనిలో మాజీ ఎమ్మెల్యే మళ్ళ విజయప్రసాద్ బిజీగా ఉన్నారు. మొత్తానికి విశాఖ పశ్చిమంలో టీడీపీ పునాదులు బాగానే కదులుతున్నాయని చెప్పాల్సిందే.విశాఖ సౌత్ లో ఏకంగా టీడీపీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ వైసీపీలోకి చేరిపోయారు. దాంతో అది ఫ్యాన్ పార్టీ ఖాతాలోనే ఉంది. తూర్పు నియోజకవర్గంలో వెలగపూడి రామక్రిష్ణబాబుకు తొలిసారి ఓటమిని కార్పొరేషన్ ఎన్నికల్లో చవి చూపించేశారు. మెజారిటీ కార్పొరేటర్లు వైసీపీ పరం అయ్యారు. దాంతో వెలగపూడి డీలా పడిపోయారు. ఇక్కడ కూడా టీడీపీని తగ్గించే పని మొదలైంది. మరో వైపు ఉత్తర నియోజకవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఏనాడో గాలికి వదిలేశారు. దాంట్లో రెండు తప్ప అన్ని వార్డులూ వైసీపీ సొంతం అయ్యాయి. ఈ విధంగా చూసుకుంటే మంచానికి నాలుగు కోళ్ళు అన్న మాదిరిగా పేరుకు నాలుగు సీట్లు టీడీపీ గెలుచుకున్నా రెండేళ్ళు తిరగకముందే ఇక్కడ టీడీపీ పునాదులు కదిలిపోతున్నాయి. వైసీపీ పక్కా వ్యూహంతో ఈ నాలుగు చోట్లా వచ్చే ఎన్నికల్లో జెండా ఎగరేయడానికి రంగం సిద్ధం చేసింది. మొత్తానికి వెనక్కి తిరిగి చూసుకుంటే టీడీపీకి విశాఖ సిటీలో ఏముంది ఇక్కడ అన్నదే ఆవేదనగా కనిపిస్తుంది.

# నూతనంగా నిర్మించిన స్టోర్ రూమ్ భవనాలనుప్రారంభించిన జిల్లా ఎస్పీ



కంచికచర్ల మే 1ప్రజాపాలన: కంచికచర్ల పోలీస్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన మూడు అదనపు గదుల భవనాన్ని శనివారం జిల్లా ఎస్పీ పి రవీంద్ర నాథ్ బాబు ప్రారంభించారు. జాతీయ రహదారి పక్క నే పోలీస్ స్టేషన్ ఇరుకుగా ఉండటంతో అదనపు సి బ్బంది విశ్రాంతితో పాటు రికార్డుల భద్రపరిచేందుకు ఇబ్బందిగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని పో లీస్ స్టేషన్ ఆవరణలో దాతల సహకారంతో పాటు ఉ సిబ్బంది సహకారంతో మూడు అదనపు గదుల ని ర్మాణం చేసినట్లు ఎస్పీ తెలిపారు. కొద్ది కాలంలోనే అదనపు గదుల నిర్మాణంతో పాటు పోలీస్ స్టేషన్లో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటంలో నందిగామ రూ రల్ కే సతీష్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ రంగనాథ్ కృషి అభినందనీయమన్నారు. అనంతరం ఆయన పోలీస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కా ర్యక్రమంలో నందిగామ డిఎస్పి జి.నాగేశ్వరరెడ్డి ఇ సి ఐ లు కే సతీష్ పీ కనకరాజు స్థానిక ఎస్సై లు ఎం పి ఎస్ రంగనాథ్ లక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో నేడు పోలీస్ కోవిడ్ సెంటర్ ప్రారంభించిన

మచిలీపట్టణం:కరోనా సెకండ్ వేవ్ రోజురోజుకు విజృంభిస్తున్న తరుణంలో లో పోలీసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన మ చి లీపట్నంలో లో ఏర్పాటుచేసిన పోలీస్ కోవిడ్ సెంటర్ ను ఈ నెల 2 నఆదివారం ప్రారంభిస్తున్నట్లు జిల్లా ఎ స్పీ పి.రవీంద్రనాథ్ బాబు తెలిపారు. శనివారం కంచిక చర్ల పోలీస్ స్టేషన్ లో అదనపు గదులను ప్రారంభిం చిన ఆయన మీడియాతో మాట్లాడారు. కరోన సెకండ్ వేవ్ రోజురోజుకు ఉద్రిక్తం అవుతుందన్న నివారణ చ ర్యల్లో భాగంగా ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. జిల్లాలోని ప్రధాన నగరాల్లో ఛాంబర్ ఆఫ్ కామర్స్ సూచనల మేరకు రాత్రి 7 గంటల తర్వాత వర్తక వా ణిజ్య వ్యాపార సంస్థలు మూసి వేస్తూ కర్ఫ్యూ విధిస్తున్నామన్నారు. ప్రజలు తప్పనిసరిగా మాస్కు ధ రించి తో పాటు అత్యవసర సమయం మాత్రమే బ యటకు రావాలని పోలీస్ శాఖ పరంగా చైతన్యం చేస్తున్నామన్నారు. కరోన విలయతాండవం చేస్తున్నం దున విధుల్లో ఉండి కరోనా బారిన పడిన పోలీసు సిబ్బంది కుటుంబాలతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఇతర ఫ్రంట్ లైన్ వారియర్స్ గా ఉన్న వారికి మెరు గైన వైద్య సేవలు అందించేందుకు పోలీసు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మచిలీపట్నంలో పోలీస్ కోవిడ్ సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. 30 పడకల సా మర్థ్యం గల పోలీస్ కోవిడ్ సెంటర్ ను ఏర్పాటు చే యటానికి రవాణా శాఖ మంత్రి పేర్ని నాని జిల్లా కలె క్టర్ ఇంతి యాజ్ అహ్మద్ సహకరించారన్నారు . ఈనె ల 2న ఆదివారం పోలీస్ కోవిడ్ సెంటర్ ను ప్రారంభి స్తున్నట్లు తెలిపారు.

# నరసరావుపేటలో ఘనంగా మే డే వేడుకలు







నరసరావుపేట, మే 01, ప్రజాపాలన ప్రతినిధి: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ను నరసరావుపేట సి ఐ టి యు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది అణిచివేత నిర్బంధం దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు మే డే స్ఫూర్తితో ముదుకు తీసుకొని వెళ్ళాలని మేడే దినోత్సవాన్ని దీక్ష దినం గా పాటించాలని సి ఐ టి యు జిల్లా కోశాధికారి డి శివ కుమారి పిలుపునిచ్చారు ఉదయం 5 గంటల నుంచి నరసరావుపేట సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో వాడవాడలా ఎర్రజెండా రెపరెపలు ప్రారంభమైంది మున్సిపల్ కార్మికులు డ్రైవర్ లు ఇంజనీరింగ్ విభాగం కార్మికులు భవన నిర్మాణ కార్మికులు అంగన్వాడీ కార్మికులు ఆశా కార్యకర్తలు ఆర్టీసీ కార్మికులు నరసరావు మార్కెటింగ్ యాడ్ ముఠా కార్మికులు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికులు విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ కార్మికులు తమ తమ సంఘాల పతాకాలను సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించుకున్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నవరపు సాల్మన్, యోహాన్, పి రాజు ,యేసు ,వీర కుమార్, ప్రసాద్, అల్లాబక్షు ,సోమశేఖర్ భావన నిర్మాణ కార్మికులు సిలార్ ,మసూద్ ,కాసు కోటిరెడ్డి, పఠాన్ మస్తాన్ వలి ,ఫ్రాన్సిస్, బ్రహ్మయ్య, అంగన్వాడీ యూనియన్ నాయకులు నిర్మల సాయి కుమారి కవిత ఆర్టీసీ ఎస్ డబ్ల్యు ఎఫ్ యూనియన్ నాయకులు కన్నెగంటి రామారావు ధూపం సుభాష్ చంద్రబోస్ యోహాన్ మార్కెటింగ్ యార్డ్ ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు నల్ల గంగుల కోటిరెడ్డి ,సాంబయ్య, శివారెడ్డి ,నరసింహారావు, ఆశా వర్కర్ సీనియర్ నాయకులు నిరాజకుమారి ,సత్యవతి నాయకత్వం వహించారు టాకీస్ వద్దగల గోపాలం చౌక్ లో ఉన్న సిపిఎం పతాకాన్ని సిపిఎం జిల్లా నాయకురాలు కుమారి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కామినేని రామారావ్ ఈఊరి మస్తాన్ రెడ్డి సయ్యద్ రబ్బాని షేక్ సుభాని గాంధీ స్మారక సమితి వ్యవస్థాపకులు ఈదర గోపీచంద్ లు పాల్గొన్నారు

# టీటీడీ యూ టర్న్...!



తిరుపతి, మే 1,:ఆర్థిక భారం తగ్గించడానికి టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఆదాయం లేని ఆలయాల పర్యవేక్షణను వెనక్కు తీసుకోనుంది. దీని వల్ల టీటీడీకి వచ్చే ప్రయోజనమేంటి? ఆలయాలు నిర్వహణ పేరిట ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న ఖర్చును తగ్గించుకోవడానికి టీటీడీ పాలక మండలి నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ పరిధిలో ఇప్పటికే 32 ఆలయాలున్నాయి. అయితే తమ ప్రాంతంలోని ఆలయాలను టీటీడీ స్వాధీనం చేసుకుని పర్యవేక్షించాలని పలువురు నేతలు ఎప్పటినుంచో విన్నవిస్తున్నారు.అయితే వారి వినతులను పక్కన పెట్టింది. కరోనా వైరస్ కారణంగా సామాన్య ప్రజలే కాదు ఆర్థిక సంస్థలు, ఆలయాలు కూడా కుదేలు అవుతున్నాయి. గత ఏడాది భారత్ పై కోవిడ్-19 ఎ ం జ ా విసరడంతో?. 2020-21 ఆర్థిక సంవత్సరానికి 12 వందల కోట్ల రూపాయల హుండీ ఆదాయాన్ని అంచనా వేసింది ఆర్థిక విభాగం. లాక్ డౌన్‌తో అంచనాలు అంత తారుమారు అయ్యాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఏడు వందల 21 కోట్ల రూపాయలు మాత్రమే శ్రీవారి హుండీ ద్వారా ఆదాయం లభించింది.గత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను కుదిస్తూ రెండు వేల 553 కోట్ల రూపాయలకు పరిమితం చేశారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాను రెండు వేల 9 వందల 37 కోట్ల రూపాయలకు అంచనా వేసింది టీటీడీ. అయితే నిత్యం శ్రీవారి హుండీ ద్వారా లభించే ఆదాయం.. లడ్డు విక్రయాలు గతంలో పోల్చితే తగ్గుముఖం పట్టింది. అలాగే ఆర్జిత సేవలు ఏకాంతం చేయడంతో ఆదాయం మరింత తగ్గింది.ఆలయాల పరిరక్షణ కోసం టీటీడీ ఏర్పాటు చేసిన శ్రీవాణి ట్రస్ట్ ద్వారా పురాతన ఆలయాల్లో ధూప, దీప నైవేద్యాలకు నిధులు స వ ం క ా ం ్ చ డ ే ం కాకుండా?. శ్రీవారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడానికి టీటీడీ సంకల్పించింది. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా గతంలో ఐదు వందల నుంచి ఏడు వందల వరకు శ్రీవారి టిక్కెట్లను కేటాయిస్తూ వస్తోంది టీటీడీ. ప్రస్తుతం కరోనా కారణంగా కేవలం 200 టిక్కెట్లను మాత్రమే రోజువారీగా జారీ చేస్తూ వస్తోంది. దీంతో ఫిబ్రవరి మాసంలో జరిగిన పాలకమండలి సమావేశంలో ఖర్చును తగ్గించే మార్గం ఎంచుకుంది.ప్రస్తుతం టీటీడీ పరిధిలో 32 ఆలయాలు ఉన్నాయి. వాటి పూర్తి బాధ్యత టీటీడీనే చూసుకుంటుంది. ఈ ఆలయాల్లో టీటీడీ ఉద్యోగితో పాటు?మరి కొందరిని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించాల్సి వస్తోంది. తద్వారా ఆలయాలకు వెచ్చించే ఖర్చు మరింత పెరుగుతోంది. ఆలయాలను టీటీడీ పరిధిలో తీసుకుంటే మరింత భారం పెరిగే అవకాశం ఉండటంతో నూతనంగా ఆలయాలను టీటీడీ పరిధిలోకి తీసుకోరాదని తీర్మానించింది.

తమ ప్రాంతాల్లో కూడా ఆలయాలను పర్యవేక్షించాలని భారీగా విన్నతులు అందుతుండటంతో ఈ నిర్ణయం తీసుకుట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయం ఇప్పుడే కొత్తగా ప్ ్ తి పా ద ి ం చ ి ం ద ి కాదు.గతంలోనూ అనేకసార్లు టీటీడీ పాలకమండలిలో సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నారు. మొదటి సారిగా 1997లో ఆలయాలను టీటీడీ పరిధిలోకి తీసుకోరాదని అప్పటి పాలకమండలి నిర్ణయం తీసుకుంది. 2005లో మరోసారి ఇదే అంశంపై తీర్మానం చేసారు. ఇక 2012లోనూ ఈ అంశం మళ్లీ చర్చకు వచ్చింది. దీనిపై ఇంజినీరింగ్, అకౌంట్స్, ఎస్టేట్, న్యాయ, సర్వీసు విభాగాల అధికారులు పరిశీలించి?వారు ఇచ్చే నివేదిక ఆధారంగా పర్యవేక్షణపై తుది నిర్ణయానికి రావాలని అప్పటి పాలకమండలి అభిప్రాయపడింది.ప్రస్తుతం టీటీడీ పరిధిలో తీసుకోవాలని విన్నతులు వస్తున్న ఆలయాలు మారుమూల ప్రాంతంలో ఉండటం..వాటి ఆదాయం మార్గాలు నామమాత్రంగా ఉండటంతో మరింత భారంగా మారుతున్నాయి. ఇక ఆ ఆలయాలకు సంబంధించిన భూములు., ఇతర ఆస్తులు వ ి ఎ ా ద ా ల ో ్ల చిక్కుకోవడం..వాటి ని విడిపించేందుకు టీటీడీ భారీగా నిధులు కేటాయించాల్సి వస్తోంది. ఇక ఆలయాలను పర్యవేక్షిస్తున్న సిబ్బందికి టీటీడీ ఉద్యోగులతో సమానంగా వేతనం ఇవ్వాలనే డిమాండ్ కూడా ఉందిపర్యవేక్షణకు తీసుకున్న దేవాలయాల్లో.. అంతకుముందు పండగలు, ఇతర కార్యక్రమాలకు నామమాత్రంగానే నిధులు వెచ్చించేవారు. ఇప్పుడు భారీగా ఖర్చు చేసి భారాన్ని టీటీడీపై మోపుతున్నారు. ఆయా ఆలయాల పరిధిలోని భూవివాదాలు, ఇతర సమస్యలపై న్యాయస్థానంలో పిటిషన్లు వేస్తున్నారు. ఇలా అనేక కేసులు కోర్టులలో ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. ఇటువంటి సమస్యలను అధ్యయనం చేసిన టీటీడీ కనీస ఆదాయం లేని ఆలయాల టేకోవర్ చేసే ఆలోచన విరమించుకుంది.

# జగన్ తో జనం..బంధం



తిరుపతి,మే 01, ప్రజాపాలన ప్రతినిధి:దేళ్ల పాటు జగన్ జనమే తానుగా బతికారు. తండ్రి వైఎస్సార్ పోయిన తరువాత తొలిసారి నల్లకాలువ వద్ద జరిగిన మీటింగులో జనంలోకి వచ్చిన జగన్ నాటి నుంచి అలుపెరగకుండా ఉమ్మడి ఏపీని పట్టుకుని గట్టుకీ పుట్టనీ వదలక తిరిగారు. మొదట ఓదార్పు యాత్ర అన్నారు. దానికి మంచి రెస్పాన్స్ రావడంతో అది కాస్తా రాజకీయ యాత్రగా మారిపోయింది. ఇక ఉమ్మడి ఏపీలో ఏదో ఒక ప్రజా కార్యక్రమం ఎంచుకుని నాటి సర్కార్ కి వ్యతిరేకంగా జగన్ రోడ్ల మీదకు వచ్చేవారు. అవన్నీ సూపర్ డూపర్ హిట్లు అయ్యాయి. అంతవరకూ నేతలు జనాల్లోకి వచ్చినా కూడా జగన్ అంతలా కనెక్ట్ అయిన సందర్భాలు అయితే లేవు. నేరుగా తెలుగు రాష్ట్రాలలోని జనాల ఇళ్లలోకి జగన్ వెళ్ళి వారితో మాటలు, మంతనాలు పెట్టడాలు మాత్రం అప్పట్లో న్యూ ట్రెండ్ అని చెప్పాలి. వారి గుడిసెల్లోనే నేల మీద కూర్చుని వారి పెట్టినదేదో కలసి తినడం ద్వారా తాను జనం మనిషిని అనిపించుకున్నారు. ఇక దాదాపుగా ఏణ్ణర్థం పాటు సాగిన జగన్ పాదయాత్ర ఒక చరిత్రగానే చూడాలి. దాని గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇలా జనం నుంచి జగన్ ని ఎవరూ విడదీయలేరు అనేంతగా ఆయన బలమైన బంధం వేసుకున్నారు. సరే జగన్ తాను కోరుకున్న టార్గెట్ ని రీచ్ అయ్యారు. ఆయన ముఖ్యమంత్రి కావాలనుకున్నారు. జనాల అపూర్వమైన ఆశీర్వాదంతో 151 సీట్లతో ఏపీ ముఖ్యమంత్రి సీటును పట్టేశారు. ఆ తరువాతనే జగన్ లో కొత్త మార్పు వచ్చింది. ఆయన అసలు బయటకు రావడమే బాగా తగ్గించారు. రెండేళ్ళ పాలనలో జగన్ జనాల వద్దకు వచ్చిన సందర్భాలు బహు అరుదుగా ఉన్నాయి. జగన్ అంటే పిచ్చి ప్రేమ పెంచుకున్న జనాలు కూడా ఇపుడు ఆయనను చూడాలనుకుంటే అది అందని వరమే అయిపోతోంది.

జగన్ ప్రచారం చేయకుండానే లోకల్ బాడీ ఎన్నికలు పూర్తి అయ్యాయి. తిరుపతి ఉప ఎన్నిక కూడా ముగిసింది.

మరి జగన్ జనంలోకి రావాల్సిన సందర్భం ఇంతకంటే ఏదీ కూడా లేదు. కానీ వాటినే వద్దనుకున్న జగన్ జనాలలోకి ఎపుడు వస్తారు అన్నదే ఇపుడు చర్చగా ఉంది. జగన్ ఓట్ల కోసం తిరుపతి వచ్చి జనాలను అడగలేదని విపక్షం అంటోంది. చంద్రబాబు అయితే జనాలను ఓటు వేయమని అడగని జగన్ కి జనం అంటే ఉన్న ప్రేమ ఏమిటో తెలిసింది అంటున్నారు. ఒక విధంగా వైసీపీ నేతలకు కూడా జగన్ జనంలోకి రాకపోవడం వల్ల ఇబ్బందిగానే ఉంది. జగన్ వైసీపీలో ఏకక ప్రజాకర్షణ నేత. ఆయన రాను అంటే ఎవరూ ఏమీ చేసేది ఉండదు. కానీ ఈ జనాలు ఎలాంటి వారు అంటే ఎంతగా ప్రేమిస్తారో చిన్న తేడా వస్తే అంతకు అంత కోపాన్ని చూపిస్తారు. అందువల్ల వారితో ఆ లింక్ కి అలా కంటిన్యూ చేయాల్సిందే. లేకపోతే బోడి మల్లయ్యలుగా తమను చూశారన్న భావన కలిగితే మాత్రం అది వైసీపీకి యమ డేంజరే. జగనే జనాల వద్దకు వెళ్ళారు. ప్రజా నాయకుడు ఎలా ఉండాలో ఆచరణలో చూపించారు. సరే అధికారంలో ఉన్న వారికి చాలా పనులు ఉంటాయి. అంతమాత్రం చేత ఏదో ఒక సందర్భంలో జనాల వద్దకు వచ్చి పలకరించకపోతే వారు హర్ట్ అవుతారు. జగన్ తీరు మాత్రం ఒకనాడు అతివృష్టిగా ఉంటే ఇపుడు అనావృష్టిగా మారింది అంటున్నారు. ఏదీ ఎక్కువ కాకూడదు. రాజకీయ లెక్కల్లో తేడాలొచ్చేస్తాయి. మరి ఇది జగన్ గ్రహిస్తారా.

## సీపీఐ నాయకుడు మృతి.. పలువురు సంతాపం



పొన్నూరు, ప్రజా పాలన ప్రతినిధి : పొన్నూరు పట్టణంలో సీపీఐ నాయకుడు గా కార్మిక యూనియన్ సేవకుడిగా ప్రసిద్ధి గాంచిన నిమ్మకాయల వెంకటేశ్వర్లు(54) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నిడుబ్రోలు రైలు పేటకు చెందిన నిమ్మకాయల సీపీఐ పార్టీ లో క్రియాశీలక కార్యకర్తగా ఇ. బి.ఆసుపత్రి ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి గా పనిచేశారు. ఆయన మృతికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ఆరేటి రామారావు, ఏ ఐ టి యు సి పట్టణ అధ్యక్షుడు సాతులూరి రమేష్ బాబు, సీపీఐ ఎమ్మెల్ నాయకులు గోగినేని పరుసురామయ్య, గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్, ఇ. బి ఆసుపత్రి సిబ్బంది తదితరులు నిమ్మకాయల పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## పొన్నూరు లో ఘనంగా మే డే ఉత్సవాలు



పొన్నూరు, ప్రజా పాలన ప్రతినిధి:మే డే సందర్భంగా పొన్నూరు పట్టణంలో శనివారం ఏ ఐ టి యు సి,సీపీఐ ఆధ్వర్యంలో పలు చోట్ల మే డే జండాలను ఆవిష్కరించారు. స్థానిక సీపీఐ కార్యాలయం,మార్కెట్ సెంటరు, మాచవరం ఆటో, ట్రాలీ స్టాండ్,ఓవర్ బ్రిడ్జి, హైస్కూలు, తదితర సెంటర్లలో జండా వందనం జరిగింది.ఏ ఐ టి యు సి పట్టణ అధ్యక్షుడు సాతులూరి రమేష్ బాబు నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్, కార్మిక ముఠా సంఘాల నాయకులు ఎం.శేషయ్య, ఎస్.డి.సుభాని, టి.తిరుపతయ్య,ఎస్.కె బాషా,ఎస్.కె బాజి,పెయింటింగ్ యూనియన్ అధ్యక్షుడు హెబ్నేజర్ బాబు, శివాజీ, పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ ఐ టి యు సి పట్టణ అధ్యక్షుడు సాతులూరి రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను ఎదిరించి పోరాడాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు.

## కేంద్రం ఇచ్చిన నిధుల్ని జగన్ ఏం చేశారు?: పట్టాభి

అమరావతి: కేంద్రం ఇచ్చిన నిధుల్ని సీఎం జగన్ ఏం చేశారని టీడీపీ నేత పట్టాభి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సీఎంకు ప్రజల ప్రాణాలు కావాలా.. పత్రికల్లో ప్రకటనలు కావాలా అని నిలదీశారు. అనేక రాష్ట్రాలు కరోనా వ్యాక్సిన్ల కొనుగోలుకు పోటీపడుతుంటే.. జగన్‌రెడ్డి కేంద్రం ఇచ్చే ఉచిత వ్యాక్సిన్లపైనే ఆధారపడతాడా? అని మరోసారి పట్టాభి ప్రశ్నించారు. “వ్యాక్సిన్లు కొనడానికి 1,600 కోట్లు రాష్ట్ర ఖజానాలో లేవా? కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారని, ప్రజల ప్రాణాల కోసం ఖర్చు పెట్టలేరా? కేంద్రం ఇచ్చిన నిధుల్ని సీఎం జగన్ ఏం చేశారు? విశాఖ స్టీల్ ప్లాంట్ దేశవ్యాప్తంగా ఆక్సిజన్ సరఫరా చేస్తుంటే ఏపీలో ఆక్సిజన్ లేదంటే ఎవరైనా నమ్ముతారా?” అని పట్టాభి ప్రశ్నించారు.

## పాడి రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం:ఎమ్మెల్యే కిలారి



పొన్నూరు, ప్రజా పాలన ప్రతినిధి:వ్యవసాయ రంగంలో ఏంతో శ్రమించి పనిచేస్తున్న పాడి రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందని స్థానిక శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. శనివారం స్థానిక నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సహకార రంగంలో ఉన్న సంగం డెయిరీ ని కంపెనీ కిందకు తెచ్చి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తన జేబు సంస్థ గా మార్చుకుని పెద్ద ఎత్తున దోపిడీ చేశారని ఆరోపించారు. పాల ఉత్పత్తి దారులకు పంచి ఇవ్వాల్సిన సంగం లాభాలు మొత్తాన్ని తన స్వంత డివిసి ట్రస్టుకు మళ్లించడం దారుణమన్నారు. ప్రభుత్వం పాలరైతుల బాగు గోరి అమూల్ సంస్థ తో సంబంధం ఏర్పాటు చేసుకున్న దన్నారు. తద్వారా పాలవుత్పత్తి దారులకు ఎక్కువ లాభాలు చేకూరుతాయన్నారు.ధూళిపాళ్ల అరెస్టు తో పాలఉత్పత్తి దారుల దోపిడీకి అడ్డుకట్ట వేసినట్లేనని కిలారి ఉద్ఘాటించారు.సంగం పరిధిలోని పాల ఉత్పత్తి దారులకు ఇక మంచి రోజులు

# ఘనంగా మే డే వేడుకలు






చీరాల(ఒంగోలు) : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా స్థానిక జయంతి పేట కారంచెడు గేటు సెంటర్లో ఉన్న సిపిఎం పార్టీ జెండాని సిపిఎం పార్టీ ఐ ఎల్ టి డి శాఖ సభ్యులు కే ఏసురత్నం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ చీరాల ఏరియా కార్యదర్శి నలతోటి బాబురావు మాట్లాడుతూ, అనేక దశాబ్దాలుగా కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కాలరాస్తుందని, 45 కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను రూపొందించిందని, వీటికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలు తాకట్టు పెట్టే విధంగా, మూడు నల్ల చట్టాలను తీసుకు వచ్చిందని, నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశ రాజధానిలో జరుగుతున్న పోరాటానికి కార్మికులకు వెన్నుదన్నుగా నిలబడాలని అన్నారు. భవిష్యత్తులో కార్మిక హక్కుల పరిరక్షణతో పాటు రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగాను, ప్రభుత్వ రంగ వ్యతిరేకంగాను కార్మికులు, కర్షకులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోశాల సుధాకర్, మేరుగా రవిచంద్ర, చిప్పలపల్లి శివరాజు, పఠాన్ కాలేషా, బోయిన లక్ష్మీనారాయణ, చెల్లి సురేంద్ర, చెల్లి లక్ష్మయ్య. తదితరులు పాల్గొన్నారు.- ఆర్టీసీ హెర్ బస్సు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో.. జెండాను ఆవిష్కరించిన కెవిపిఎస్ డివిజన్ కార్యదర్శి లింగం జయరాజు, పాల్గొన్న యూనియన్ నాయకులు కర్రీ ఆంజనేయులు. వేణుగోపాల్ రెడ్డి. ఎర్రం నాగిరెడ్డి. పాల్గొన్నారు. చీరాల ఐ ఎల్ టి డి కంపెనీ వద్ద... మేడే జెండాను ఆవిష్కరించిన ఏపీ ఫెడరేషన్ ఆఫ్ కంపెనీ వర్కర్స్ అధ్యక్షులు చిప్పలపల్లి శివ రాజు కార్యక్రమంలో పాల్గొన్న ఫెడరేషన్ నాయకులు గోసాల సుధాకర్. మెరుగ రవిచంద్ర. పటాన్ కాలీషా. కుందుర్తి నీలాంబరం. బోయిన లక్ష్మీనారాయణ. భాస్కర్. చెల్లి పోతురాజు. చెల్లి లక్ష్మయ్య .సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు ఎన్. బాబురావు పాల్గొన్నారు. చీరాల గోపాలకృష్ణయ్య పార్క్ వద్ద... ఫోర్ వీలర్ ఆటో కార్మికులు వే డే జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు ఎన్. బాబురావు పాల్గొన్నారు. పేరాల సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించిన సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు నలతోటి బాబురావు, చీరాల మున్సిపల్ కార్యాలయం వద్ద మేడే జెండాను ఆవిష్కరించిన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కుర్ర రామారావు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి వారికి ఆశ్వవాహనోత్సవం



జగ్గయ్యపేట మే1(ప్రజాపాలన)జగ్గయ్యపేట మండ లం తిరుమలగిరి గ్రామములో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్తానము యొక్క వార్షిక బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన నేడు శ్రీ స్వామి వారికి ఉదయం విశేష పూజలు, ఆశ్వవాహనోత్సవం నిర్వ హించుట జరిగినది. సాయంత్రం శ్రీ స్వామి వారికి ద్వాదశ సేవలు అనంతరం పవళింపు సేవ కార్యక్ర మం కార్యక్రమం నిర్వహించుట జరిగినది అని ఈ రోజుతో శ్రీ స్వామి వారి బ్రహ్మోత్సవాలు పూర్తి అయి న ట్లు ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యని ర్వహణాధికారి ఎన్ ఎస్ చక్రధరరావు తెలిపారు.

## పట్టణ తెదేపా కార్యాలయంలో తంగిరాల ప్రభా కర రావు జయంతి వేడుకలు



నందిగామ మే 01, ప్రజాపాలన ప్రతినిధి:నందిగామ మాజీ శాసన సభ్యులు కీ.శే. స్వర్గీయ తంగిరాల ప్రభాకరరావు గారి పుట్టినరోజు వేడుకలను తెలుగు తమ్ముళ్లు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు నందిగామ పట్టణ తెలు గుదేశం పార్టీ కార్యాలయంలో తంగిరాల పుట్టినరోజును పురస్కరించుకొని కేక్ కట్ చేసారు. అనంతరం మధిర్ రోడ్డు నందు గల తంగిరాల స్మారక ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తొలుత గాంధీ సెంటర్ వద్ద గల తంగిరాల ప్రభాకరరావు విగ్ర హానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అ ర్పించారు.

## ఘనంగా మేడే దినోత్సవ వేడుకలు



నందిగామ, మే 01, ప్రజాపాలన ప్రతినిధి:నందిగామ పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మేడే ది నోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ,ముం దుగా మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎ మ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ,శ్రామికుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు ,అందులో భాగంగానే అన్ని వ ర్గాల-రంగాల కార్మికులకు ,శ్రామికులకు, కర్షకులకు ఆర్థికంగా మేలు జరిగే విధంగా ప్రభుత్వం సంక్షేమ ప థకాలను అమలు చేస్తుందన్నారు ,వైయస్సార్ కాం గ్రెస్ పార్టీ పేరే యువజన, శ్రామిక, రైతు పార్టీ అని వా రి అభివృద్ధి కోసం పెట్టిన వైయస్ఆర్ కాంగ్రెస్ పా ర్టీ తోనే అందరికీ మేలు జరుగుతుందన్నారు ,ఈ కా ర్య క్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కా ర్యకర్తలు పాల్గొన్నారు ..

## సీనియర్ జర్నలిస్టుకు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే కిలారి

పొన్నూరు, మే 01, ప్రజాపాలన ప్రతినిధి: పొన్నూరులో ఆంధ్రభూమి దినపత్రికలో పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ షేక్ కరీముల్లా ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. తోటి జర్నలిస్టుల ద్వారా కరీముల్లా ఆరోగ్య సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య శుక్రవారం రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. వైసిపి సీనియర్ నాయకులు కొల్లేరు శ్రీనివాసరావు, వైసిపి కార్యాలయ ప్రతినిధి కిరణ్ ఎమ్మెల్యే కిలారి రోశయ్య ఇచ్చిన నగదును కరిముల్లాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.





# బ్లాక్ బస్టర్ కాంబోపై క్రేజీ రూమర్..!



సూపర్ స్టార్ మహేష్ బాబు – డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్ లో వచ్చిన 'సరిలేరు నీకెవ్వరు' సినిమా బ్లాక్ బస్టర్ గా బాప్ అనిపించుకుంది. ఇది మహేష్ కెరీర్లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన సినిమాగా నిలిచింది. ఈ నేపథ్యంలో వీరిద్దరి కలయికలో మరో మూవీ రానుందని ఎప్పటి నుంచో వార్తలు వస్తూనే ఉన్నాయి. ఇటీవల 'గాలి సంపత్' ప్రమోషన్స్ లో మహేష్ తో ఇంకో సినిమా ఉండొచ్చని కలిసి మాట్లాడాలని డైరెక్టర్ అనిల్ చెప్పుకొచ్చారు. దీంతో మహేష్ నెక్స్ట్ ప్రాజెక్ట్ అనీల్ తోనే ఉంటుందని అందరూ భావించారు. అయితే ఇప్పుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తో 'చ%ూావీదీ%28' ప్రాజెక్ట్ కి కమిట్ అయ్యారు మహేష్.ప్రస్తుతం పరశురామ్ దర్శకత్వంలో చేస్తున్న 'సర్కారు వారి పాట' సినిమా తర్వాత త్రివిక్రమ్ సినిమానే ఉంటుంది. దీని తర్వాత దర్శకధీరుడు రాజమౌళి తో ఓ పాన్ ఇండియా మూవీ చేయాల్సి ఉంది. దీంతో అనిల్ రావిపూడితో సినిమా ఉండకపోవచ్చని అనుకున్నారు. అయితే తాజాగా సినీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్ ప్రకారం మహేష్ – అనిల్ కాంబినేషన్ లో కచ్చితంగా మరో సినిమా చేస్తారని తెలుస్తోంది. కాకపోతే ప్రస్తుతం మహేష్ కమిటైన సినిమాల తర్వాతే ఉంటుందని అంటున్నారు. అంతేకాకుండా ఇది 'సరిలేరు నీకెవ్వరు' సినిమాకి సీక్వెల్ అని కూడా టాక్ వస్తోంది. ఇందులో నిజమెంతో తెలియాలంటే ఇంకొన్నాళ్లు ఆగాల్సిందే. ఇకపోతే అనిల్ రావిపూడి ప్రస్తుతం 'ఎఫ్ 3' సినిమాపై వర్క్ చేస్తున్నాడు. దీని తర్వాత నందమూరి బాలకృష్ణ తో ఓ సినిమా చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## క్రియేటివ్ డైరెక్టర్ పుకార్లకు చెక్ పెట్టనున్నాడా..??



ప్రస్తుతం కరోనా కారణంగా సినిమా ఇండస్ట్రీలో అనుకోని మార్పులు చోటుచేసుకుంటాయి. అనుకున్నవన్నీ తారుమారు అవుతూ అనుకోనివి జరిగి పోతుంటాయి. ప్రస్తుతం అలాంటి పరిస్థితి టాలీవుడ్ ఇండస్ట్రీలో కనిపిస్తుంది. ఎందుకంటే ఎంతో కష్టపడి సినిమా ప్రమోషన్స్ చేసాక సరిగ్గా విడుదల సమయంలో వాయిదా అనే పదం వినిపించే సరికి చాలా నిరుత్సాహపడాల్సి వస్తుంది. కొన్ని సినిమాల విషయంలో ఇదే జరిగింది. మరికొన్ని సినిమాలు ఎంతవరకు పూర్తయ్యాయో తెలియదు. కానీ రిలీజ్ కు రెడీ అయిపోయింది అనే వార్తలు వింటుంటాం. అందులోను ఎలా రిలీజ్ చేయబోతున్నారు..? అనే విషయం కూడా ఎవరికి వారే పుకార్లు సృష్టించేసరికి మేకర్స్ దిగిరావాల్సి ఉంటుంది.ప్రస్తుతం ఇలాంటి పరిస్థితి మెగాహీరో వైష్ణవ్ తేజ్ – డైరెక్టర్ క్రిష్ సినిమా విషయంలో ఏర్పడింది. ఏంటంటే.. వైష్ణవ్ డెబ్యూ మూవీ ఉప్పెన విడుదలకు ముందే లాక్డౌన్ సమయంలో క్రిష్ సినిమా షూటింగ్ కంప్లీట్ అయిపోయింది. వైష్ణవ్ – రకుల్ ప్రీత్ సింగ్ జంటగా క్రిష్ ఓ గ్రామీణ నేపథ్యం కలిగిన కథతో సినిమా రూపొందించాడు. అదికూడా కొండపోలం అనే పుస్తకం ఆధారంగా తెరకెక్కినట్లు సినీవర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రస్తుతం ఈ సినిమాకు కొండపోలం జంగిల్ బుక్ అనే పేర్లు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. సోషల్ మీడియాలో క్రిష్ ఈ సినిమాను త్వరలో ఓటిటి రిలీజ్ చేస్తాడని వార్తలు ముమ్మరంగా ప్రచారం జరుగుతుంది. తాజా సమాచారం ప్రకారం.. ఈ పుకార్లకు చెక్ పెట్టడానికి క్రిష్ త్వరలోనే సినిమా టైటిల్ రివీల్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే సినిమాను థియేట్రికల్ రిలీజ్ చేయాలనీ భావిస్తున్నట్లు టాక్. చూడాలి మరి ఏం అప్డేట్ ఇస్తారో..!

# చైతూ సినిమా కూడా ఆగిపోయింది



కరోనా సెకండ్ వేవ్ తో దేశ వ్యాప్తంగా సినిమాల షూటింగ్ లకు బ్రేక్ లు పడ్డాయి. చిన్నా చితకా సినిమాల షూటింగ్ లు పది లేదా ఇరవై మందితో జరుపుతున్నారు కాని పెద్ద సినిమాలు మాత్రం ఆగిపోయాయి. మొండిగా షూటింగ్ జరిపిన కొన్ని సినిమా లు కరోనా కారణంగా నిలిచి పోయిన విషయం తెల్సిందే. మొత్తంగా హైదరాబాద్ లో ఒకటి రెండు పెద్ద సినిమాలు మినహా మొత్తంగా ఆగిపోయాయి. అయితే ఇటలీకి వెళ్లిన నాగచైతన్య 'థ్యాంక్యూ' మాత్రం కంటిన్యూగా షూటింగ్ జరుపుకుంటూ ఉందని ఇటీవలే వార్తలు వచ్చాయి. థ్యాంక్యూ సినిమా షూటింగ్ కూడా తాత్కాలికంగా నిలిచి పోయింది. ఇటలీలో షూటింగ్ జరుపుకుంటున్న థ్యాంక్యూ తో ప్రకాష్ రాజ్ తో పాటు మరి కొందరు నటీ నటులు ఇండియా నుండి జాయిన్ అవ్వాల్సి ఉంది. కాని ఇండియాలో కరోనా సెకండ్ వేవ్ తో లక్షల కేసులు నమోదు అవుతున్న కారణంగా ఇటలీకి ఇండియా నుండి విమానాలను నిలిపి వేశారు. దాంతో వారు థ్యాంక్యూ టీమ్ తో ఇక్కడ నుండి వెళ్లి కలువలేక పోయారు. షూటింగ్ ప్రకాష్ రాజ్ జాయిన్ కాకుంటే చేయడం కష్టం. ఇప్పటికే అనుకున్న మేరకు సన్నివేశాలను చిత్రీకరించారు. కనుక ప్రస్తుతానికి షూటింగ్ ను నిలిపి వేశారు. చిత్ర యూనిట్ సభ్యులు ఇండియాకు తిరిగి వస్తారా లేదంటే కొన్నాళ్లు అక్కడే వెయిట్ చేస్తారా అనేది చూడాలి. థ్యాంక్యూ సినిమాకు మనం దర్శకుడు విక్రమ్ కుమార్ దర్శకత్వం వహిస్తుండగా దిల్ రాజు నిర్మిస్తున్న విషయం తెల్సిందే.

## ఇక సొంతంగా.. ఫైర్ బ్రాండ్ మరింత పెచ్చిపోతుందేమో

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ ఎప్పుడు ఏదో ఒక విషయమై సోషల్ మీడియాలో ఈమధ్య ఉంటూనే ఉంది. తనకు సంబంధం ఉన్నా లేకున్నా ట్రెండింగ్ విషయాలపై స్పందిస్తూ వివాదాస్పదంగా వ్యాఖ్యలు చేస్తూ ఉంటుంది. తన సినిమాల ప్రమోషన్ల సమయంలో కూడా వివాదాలను రాజేసేలా మాట్లాడటం ఈమెకు అలవాటు. ఇప్పటి వరకు ఈమె ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించింది. అయితే ఇప్పటి వరకు చేసిన సినిమాలన్నీ కూడా వేరే బ్యానర్ ల్లో కాని ఇకపై సొంత బ్యానర్ లో సినిమాలను నిర్మించేందుకు సిద్దం అయ్యింది. వివాదాస్పద హీరోయిన్ గా పేరు రావడంతో ఈ అమ్మడిని పలురు స్టార్ ఫిల్మ్ మేకర్స్ దూరంగా పెట్టాలని భావిస్తున్నారు. దాంతో కంగనా సొంతంగా నిర్మాణ సంస్థను మొదలు పెట్టింది. తనకు ఇష్టమైన సక్సెస్ ఫుల్ చిత్రం మణికర్ణిక పేరును తన బ్యానర్ కు పెట్టింది. మణికర్ణిక ఫిల్మ్స్ అంటూ బ్యానర్ పేరును పెట్టిన కంగనా త్వరలోనే ఒక సినిమాను నిర్మించేందుకు సిద్దం అవుతున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటి వరకు ఇతర బ్యానర్ ల్లో నటించడం వల్ల కంగనా వివాదాల విషయంలో కాస్త తగ్గినా ఇక సొంత బ్యానర్ కనుక రెచ్చి పోవడం ఖాయం అంటున్నారు. కంగనా తన సొంత బ్యానర్ లో మొదటి ప్రాజెక్ట్ గా డిజిటల్ ప్లాట్ ఫామ్ కోసం వెబ్ సిరీస్ ను తెరకెక్కించబోతున్నట్లుగా తెలుస్తోంది. ఆ తర్వాత తర్వాత సినిమాల్లో కూడా ఈమె నిర్మాణ సంస్థ ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. కంగనా ప్రస్తుతం తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత పాత్రలో తలైవి సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ఆ సినిమా త్వరలో హిందీ.. తమిళం.. తెలుగు భాషల్లో విడుదల కాబోతుంది.

# ప్రభాస్ సరసన మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్..!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్.. రాధేశ్యామ్ లాంటి క్లాస్ లవ్ స్టోరీ తర్వాత వరుసగా మాస్సివ్ సినిమాలను లైన్ లో పెట్టేసాడు. ఇప్పటికే రాధేశ్యామ్ విడుదలకు సిద్ధం అవుతుండగా.. మరోవైపు రెండు సినిమాలను బాలన్స్ చేస్తూ షూటింగ్ ఫినిష్ చేస్తున్నాడు. కేజీఎఫ్ సినిమాతో మాస్ హిట్ అందుకున్న డైరెక్టర్ ప్రశాంత్ నీల్. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో ప్రభాస్ 'సలార్' అనే సాలిడ్ మాస్ మూవీ చేస్తున్నాడు. ఆల్రెడీ ఈ సినిమాను వచ్చే ఏడాది విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాలో ప్రభాస్ జోడిగా శృతిహాసన్ నటిస్తోంది. సలార్ తో పాటుగా ప్రభాస్.. బాలీవుడ్ డైరెక్టర్ ఓంరౌత్ దర్శకత్వంలో 'ఆదిపురుష్' సినిమా చేస్తున్నాడు. రామాయణం నేపథ్యంలో పౌరాణిక చిత్రంగా ఆదిపురుష్ తెరకెక్కుతుంది. ఈ సినిమాలో ప్రభాస్ సరసన హీరోయిన్ గా కృతిసనన్ నటిస్తోంది. వీటితో పాటు ప్రభాస్ ఆల్రెడీ మహానటి ఫేమ్ నాగ్ అశ్విన్ సినిమాను ఓకే చేసాడు. సైంటిఫిక్ యాక్షన్ థ్రిల్లర్ గా ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ ఏడాది దసరా సందర్బంగా నాగ్ అశ్విన్ తో సినిమా ప్రారంభం కానున్నట్లు వార్తలొస్తున్నాయి. పాన్ వరల్డ్ సినిమాగా నాగ్ అశ్విన్ ఈ సినిమాను ప్లాన్ చేస్తున్నాడు. అయితే ఈ సినిమాలతో పాటు ప్రభాస్.. బాలీవుడ్ యాక్షన్ మూవీస్ డైరెక్టర్ సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ఓ సాలిడ్ యాక్షన్ మూవీ ప్లాన్ చేశారు. త్వరలోనే రిలీజ్ డేట్ రాబోతున్న ఈ సినిమాలో ప్రభాస్ హీరోయిన్ గా బాలీవుడ్ సుందరి కత్రినా కైఫ్ నటించనున్నట్లు టాక్. ఇప్పటికి సాహో సినిమా నుండి ప్రభాస్ సినిమాలలో బాలీవుడ్ హీరోయిన్స్ మాత్రమే కనిపిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. ప్రభాస్ – సిద్ధార్థ్ సినిమాలో కత్రినా అంటే చూడాలి మరి ఈ పెయిర్ ఎలా ఉండబోతుందో..!

# సిక్స్ ప్యాక్ కార్మికుడిగా సూపర్ స్టార్ అల్లుడు..!



సూపర్ స్టార్ ఫ్యామిలీ నుంచి హీరోగా ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చిన సుధీర్ బాబు.. కథాబలం ఉన్న సినిమాలు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. సినిమాలో కోసం ఎంత రిస్క్ అయినా తీసుకునే సుధీర్.. తన పాత్ర కోసం శక్తినంతా ధార పోస్తుంటారు. కఠినమైన వర్కౌట్స్ చేస్తూ పర్ఫెక్ట్ ఫిజిక్ ని మెయింటైన్ చేస్తూ వస్తున్నాడు. 'భాగీ' సినిమాలో తన బాడీని శాంపిల్ గా చూపించి.. 'వి' సినిమాలో కండలు తిరిగిన ఆరు పలకల దేహంతో విశ్వరూపం చూపించాడు. ఈరోజు కార్మికుల దినోత్సవం సందర్భంగా స్పెషల్ పోస్టర్ ద్వారా మరోసారి తన యాబ్స్ ని చూపించాడు. 'ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గానికి సెల్యూట్..!! మనందరం ఒకరికొకరం' అంటూ సోషల్ మీడియా ద్వారా మే డే శుభాకాంక్షలు తెలియజేశారు సుధీర్ బాబు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ లో ఆయన సిక్స్ ప్యాక్ లుక్ వావ్ అనేలా ఉంది. బొగ్గు గనుల్లో పని చేసే కార్మికుడిగా టోపీ మరియు పనిముట్లు పట్టుకుని నిలబడ్డాడు. డిఫరెంట్ హెయిర్ స్టైల్ – గడ్డం మీసాలతో ఉన్న సుధీర్ ఫోటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఇక సినిమాల విషయానికొస్తే సుధీర్ ప్రస్తుతం 'శ్రీదేవి సోడా సెంటర్' అనే సినిమా చేస్తున్నాడు. 'పలాస 1978' ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సుధీర్ ఫ్రెండ్ విజయ్ చిల్లా నిర్మిస్తున్నారు. అలానే ఇంద్రగంటి మోహనకృష్ణతో 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' అనే సినిమా చేస్తున్నాడు. దీనికి సుధీర్ బాబు నిర్మాతగా కూడా వ్యవహరిస్తుండటం విశేషం.

## నేను చిల్ అయిపోతాను.. మీరు థ్రిల్ అయిపోతారు: హీరో






"అల్లు శిరీష్.." పరిచయం అవసరం లేని కుమారుడు స్టార్ హీరో సోదరుడు.. ఎదుగుతున్న హీరో. అల్లుశిరీష్ సినిమాలు కాస్త టైమ్ పడుతుందేమోగానీ.. ఆయన పేరు. ప్రముఖ నిర్మాత ఇప్పుడిప్పుడే ప్రేక్షకులకు చేరడానికి అప్డేట్స్ మాత్రం వెంటనే చేరిపోతుంటాయి. సోషల్ మీడియాలో అంతగా యాక్టివ్ గా ఉంటారు మరి!తన కెరీర్ తోపాటు పర్సనల్ విషయాలను కూడా ఫ్యాన్స్ తో షేర్ చేసుకుంటూ ఉంటారు శిరీష్. తాజాగా సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. ఇందులో ఒక ఫోటో షేర్ చేసిన ఆయన.. తను ఎంతో ఇష్టపడే ప్లేస్ ఇదేనని చెప్పారు. తాను ఎక్కువగా హ్యాంగ్ అవుట్ అయ్యేది మూడు ప్రాంతాల్లో అని చెప్పారు. అందులో ఒకటి కాఫీ షాప్ అని తెలిపిన శిరీష్.. రెండో బుక్ స్టోర్స్ అని చెప్పారు. ఇక మూడో ప్రదేశం ఏదైనా ఉందంటే.. ఇప్పుడు షేర్ చేసిన ఫొటోలోని చోటు అని వెల్లడించారు. అయితే.. ఆ చోటు ఫారెన్ లోదో.. మరెక్కడిదో కాదు. వాళ్ల ఇంట్లోని గార్డెన్ ప్రాంతం! అవును.. ఈ ప్లేస్ లో తను చిల్ అవుతూ ఉంటాడట. ఇక శిరీష్ సినిమాల గురించి చూస్తే.. తన లాస్ట్ మూవీ ఏబీసీడీ. ఈ చిత్రం వచ్చి చాలా కాలమైంది. ఆ తర్వాత కొవిడ్ తో మరింత గ్యాప్ వచ్చింది. అయితే.. ప్రస్తుతం బ్యూటీ అనూ ఇమ్మాన్యుయేల్ తో ఓ సినిమా చేస్తున్నారు శిరీష్.


Jaibheem

పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి

www.ambedkarrajaneethi.com

ఆధ్వర్యంలో,

బుద్ధ జయంతి రోజున

"జీవిత సాఫల్య పురస్కారాలు"

ఇవ్వడానికి నిర్ణయం తీసుకోవడం జరిగింది.

ఈ అవార్డును 65 సంవత్సరాల పైబడి, ప్రజలతో మమేకమై బహుజన సమస్యల మీద పోరాడిన అభ్యుదయవాదులు, కాపు, బలిజ ,బీసీలు, ఎస్సీలు ఎస్టీలు ,ముస్లిమ్స్,క్రిస్టియన్స్ Bhuddhists వర్గాలకు సంబంధించిన వ్యక్తులకు ఇవ్వటానికి నిర్ణయించి,ఈ దిగువ తెలిపిన వారిని కమిటీగా నియమించడం జరిగింది.

నిశాంత్ బహుజన
CWC,& Cine Director
73963229862

నేరెళ్ల కోటేశ్వరరావు బహుజన
CWC & Director
SnehaTV and AmbedkarTV
94400538583

ఆరేపల్లి రాజేంద్ర బహుజన
CWC, and Director Co-ordination
AmbedkarTV
9440918371

మీకు తెలిసిన ఆయా వర్గాల్లోని అర్హులైన వారి వివరాలు కమిటీకి 7-5 -21 తారీకు లోపు పంపించవలసినదిగా కోరుచున్నాను

కటికల శివ భాగ్య రావు బహుజన
నేషనల్ కన్వీనర్

పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి

జై పూలే జై భీమ్ జై భారత్


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at :SEHASAI PRINTERS, D. 3-88, CHANRA TEATRE, GOSALA MAIN ROAD PENAMALURU MANDAL, DIST KRISHNA , ANDHRAPRADESH.,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16,Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com